ప్రతి అక్షరం - ప్రజల కోసం

# రోమింగ్ న్యూస్

తెలుగు దినపత్రిక

యాదాద్రి భువనగిరి

పేజీలు : 8
సంపుటి : 3
సంచిక : 179

గురువారం 2 జనవరి 2025 | చీఫ్ ఎడిటర్ : గొట్టిపర్తి భాస్కర్ | HYDERABAD, KARIMNAGAR, KHAMMAM, NALGONDA, NIZAMABAD, WARANGAL, MAHABUBNAGAR.RANGAREDDY, MEDAK, ADILABAD

## మీరు ఇప్పటికైనా మేల్కొనరా..!?

టీమిండియా ఆటగాళ్లపై నోరుపారేసుకున్న గంభీర్



07



# డీఏపీపై సబ్సిడీ పెంపు

## 50 కేజీల బస్తా రూ.1,350

- రూ.3850 కోట్లతో ప్రత్యేక ప్యాకేజీ పొడిగింపు
- పంట బీమాకు రూ.69,515 కోట్లు
- కేంద్ర క్యాబినేట్ కీలక నిర్ణయాలు
- న్యూఇయర్‌వేళ రైతులకు గుడ్‌న్యూస్
- ఉద్యోగులకు డీఏ, కరువు భత్యం పెంచే యోచన!
- నిరుద్యోగుల కోసం ప్రత్యేక శిక్షణకు నిర్ణయం



**న్యూ ఢిల్లీ, రోమింగ్‌న్యూస్:** 2025 కొత్త యేడాదిలో ప్రధాని నేతృత్వంలోని కేంద్ర క్యాబినేట్ సమావేశమై పలు కీలక నిర్ణయాలు తీసుకుకుంది. అందులో భాగంగా పీఎం కిసాన్ సమ్మాన్ యోజన పథకం ద్వారా ఇచ్చే మొత్తాన్ని రూ. 6 వేల నుంచి రూ. 10 వేల వరకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లుగా వెల్లడించింది. ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర కేబినెట్ 2025 సంవత్సరంలో తొలిసారి సమావేశమై కీలక నిర్ణయాలు తీసుకుంది. డీఏపీ ఎరువుపై రైతులకు ఇచ్చే సబ్సిడీని మరింత పెంచాలని నిర్ణయించింది. డీఏపీపై అదనపు భారాన్ని కేంద్రమే భరించనున్నది. ఇకపై ఒక 50 కిలోల డీఏపీ బస్తా రూ.1350 కే లభ్యం కానున్నది. కేంద్రం తాజాగా

మిగతా 2 లో

# విదేశీ పర్యటనకు సీఎం రేవంత్ రెడ్డి



- 20 నుంచి 24 వరకూ దావోస్ టూర్
- ప్రపంచ ఆర్థిక వేదిక 55వ వార్షిక సదస్సు
- 15 నుంచి 19 వరకూ ఆస్ట్రేలియాలో సీఎం బృందం పర్యటన
- 19,20 తేదీల్లో సింగపూర్‌లో పారిశ్రామికవేత్తలతో సీఎం భేటీ

**హైదరాబాద్, రోమింగ్‌న్యూస్:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 15 నుంచి విదేశీ పర్యటనకు వెళ్లనున్నారు. ఆస్ట్రేలియా, సింగపూర్, స్విట్జర్లాండ్‌లో రేవంత్ బృందం పర్యటించనుంది. స్విట్జర్లాండ్‌లోని దావోస్ వేదికగా ఈ నెల 20 నుంచి 24 వరకు 5 రోజుల పాటు ప్రపంచ ఆర్థిక వేదిక 55వ వార్షిక సదస్సు జరగనుంది. ఈ నేపథ్యంలో జనవరి 21 నుంచి 23 వరకూ సీఎం రేవంత్‌తో పాటు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల

మిగతా 2 లో

## మేడ్చల్, శామీర్‌పేట్ వరకు మెట్రో రైలు

## రెండు కారిడార్ల డీపీఆర్‌లకు గ్రీన్‌సిగ్నల్

- నగర వాసులు సీఎం న్యూ ఇయర్‌గిఫ్ట్
- తీరనున్న హైదరాబాద్ వాసుల కష్టాలు
- ఎంపీ ఈటెల సలహా తీసుకోవాలని సీఎం సూచన





గుట్ట గుడికి భారీగా తరలి వచ్చిన భక్తజనం

న్యూ ఇయర్ తొలి రోజే రూ.83.26 లక్షల ఆమ్దానీ

# గుట్ట 'నర్సన్న'కు రికార్డు ఆదాయం

- గతేడాది జనవరి ఫస్టున వచ్చిన ఆదాయం రూ.76.78 లక్షలు
- 2024 జనవరి ఒకటి వచ్చిన ఆదాయం కంటే ఈసారి రూ.6.48 లక్షలు అధికం
- ఖుషీ...ఖుషీగా ఆలయాధికారులు



# ఫార్ములా ఈ కేసు లొట్టపీసు కేసు

- ఏదో రకంగా జైలుకు పంపాలని చూస్తున్నారు
- మీడియా సమావేశంలో కేటీఆర్ వ్యాఖ్యలు
- పార్టీ నేతలు, అభిమానుల న్యూ ఇయర్ శుభాకాంక్షలు

ఫార్ములా ఈ కేసు లొట్టపీసు కేసు అంటూ కేటీఆర్ వ్యాఖ్యలు చేశారు. 'పాపం.. నన్ను ఏదో రకంగా జైలుకు పంపాలని ప్రభుత్వం చూస్తోంది. నాపై ఇది ఆరో ప్రయత్నం.. రేవంత్‌కు ఏమీ దొరకటం లేదు' అంటూ సెటైర్ విసిరారు. రూ.600 కోట్ల సంగతి అటుంచి తే.. పైసా కూడా అవినీతి లేదన్నారు.జడ్జి అడిగే ప్రశ్నలకు ఏజీ దగ్గర సమాధానం లేదన్నారు. రేసు కావాలని తాను నిర్ణయం తీసుకున్నాని.. వద్దనేది రేవంత్ నిర్ణయమన్నారు. ఇద్దరి నిర్ణయాలపై క్యాబినెట్‌లో చర్చ జరగలేదన్నారు.

మిగతా 3 లో






## 16 మంది టీచర్లపై వేటు

- యాదాద్రి జిల్లాలో ఉత్తర్వులు జారీ చేసిన డీఈవో
- 2005 నుంచి సెలవులో ఉన్న పలువురు

02

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
గురువారం
2 జనవరి
2025









# 16 మంది టీచర్లపై వేటు

**హైదరాబాద్, జనవరి 1 :** యాదాద్రి భువనగిరి జిల్లాలో దీర్ఘకాలికంగా విధులకు దుమ్మా కొడుతున్న 16 మంది టీచర్లపై వేటు పడింది. వారిని సర్వీస్ నుంచి తొలగిస్తూ విద్యాశాఖ నిర్ణయం తీసుకుంది. యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలోని పలు పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు పాఠశాలకు రాకుండానే అన్ని సదుపాయాలు పొందుతున్నారు. స్కూల్ అసిస్టెంట్ గీతారాణి, ఎస్జీటీలు విజయలక్ష్మీ, శ్రీనివాస్ రెడ్డి, ఉమారాణి, ప్రభాకర్ రెడ్డి, అబ్దుల్ హమీద్, స్వప్న, మాధవి, నవీన్ కుమార్, ఎం.ఉమాదేవి, క్రాంతి కిరణ్, జె.ఉమాదేవి, నర్సింహారావు, శైలజ, భాగ్యలక్ష్మీ, కిరణ్‌కుమారి 2005 నుంచి 2022 వరకు అనధికారికంగా విధులకు గైర్హాజరయ్యారు. ఈ విషయం విద్యాశాఖ దృష్టికి వెళ్లడంతో.. దీర్ఘకాలికంగా విధులకు గైర్హాజరవ్వడంపై వివరణ ఇవ్వాలని సదరు ఉపాధ్యాయులను నోటీసులు ఇచ్చింది. అయినప్పటికీ స్పందించలేదు. దీంతో విద్యాశాఖ అధికారులు గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చి 16 మంది ఉపాధ్యాయులను సర్వీసు నుంచి తొలగించారు. ఈ విషయాన్ని యాదాద్రి భువనగిరి జిల్లా డీఈవో సత్యనారాయణ తెలిపారు. యాదాద్రి జిల్లాలో 16 మంది ప్రభుత్వ టీచర్లను విధుల్లో నుంచి తొలగించారు. వీరు దీర్ఘకాలికంగా విధులకు గైర్హాజరు కావడంతో డీఈవో ఇటీవల నోటీసులిచ్చారు. అయినప్పటికీ స్పందించకపోవడంతో సర్వీస్ నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

# ప్రధాని న్యూ ఇయర్ శుభాకాంక్షలు

**న్యూఢిల్లీ, జనవరి 1 :** నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం ఎక్స్ లో పోస్టు చేశారు. ఈ సంవత్సరం కొత్త అవకాశాలు, విజయాలు, అంతులేని ఆనందాన్ని తీసుకురావాలని ఆకాంక్షించారు. 'హ్యాపీ 2025! ఈ సంవత్సరం ప్రతి ఒక్కరికీ కొత్త అవకాశాలు, విజయాలు మరియు అంతులేని ఆనందం తీసుకురావాలి. ప్రతి ఒక్కరూ ఆరోగ్యం, శ్రేయస్సుతో ఆశీర్వదించబడాలి' అని ఆయన ఎక్స్ లో పేర్కొన్నారు.

# నేటి నుంచి టీజీ టెట్-2024 పరీక్ష

**హైదరాబాద్, జనవరి 1 :** టీజీ టెట్ 2024 అర్హత పరీక్షలను ఈ నెల 2వ తేదీ నుంచి 20 వరకు నిర్వహించనున్నారు. ఈ పరీక్షలను కంప్యూటర్ బేస్డ్ విధానంలో నిర్వహించనున్నారు. టెట్ పరీక్షలకు 2.75 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. టెట్ హాల్ టికెట్లు 2024. అనే వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. జనవరి 2వ తేదీ నుంచి 20వ తేదీ వరకు పది రోజుల పాటు 20 సెషన్లలో పరీక్షలను నిర్వహించనున్నారు. ప్రతి రోజు రెండు సెషన్లు అంటే సెషన్ 1 ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకు, సెషన్ -2 మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. పేపర్-1 పరీక్షలను జనవరి 8, 9, 10, 18 తేదీల్లో నిర్వహించనున్నారు. పేపర్ -2 పరీక్షలను జనవరి 2, 5, 11, 12, 19, 20వ తేదీల్లో నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం సెషన్‌కు హాజరయ్యే అభ్యర్థులను ఉదయం 7.30 నుంచి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించనున్నారు. మధ్యాహ్నం సెషన్‌కు హాజరయ్యే వారిని మ. 12.30 గంటల నుంచి అనుమతించనున్నారు. ఇక పరీక్ష ప్రారంభానికి 15 నిమిషాల ముందే పరీక్షా కేంద్రం గేట్లను క్లోజ్ చేయనున్నారు. అంటే ఉదయం సెషన్‌లో ఉ. 8.45కు, మధ్యాహ్నం సెషన్‌లో 1.45 గంటలకు గేట్లను మూసివేయనున్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా హాల్ టికెట్‌తో పాటు బ్లాక్ లేదా బ్లూ బాల్ పాయింట్ పెన్, గుర్తింపు కార్డు(ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, పాస్ పోర్ట్, పాన్ కార్డు, ఓటర్ ఐడీ) తీసుకెళ్లాలి. స్మార్ట్ వాచీలతో పాటు ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదు.

# మహారాష్ట్రలో మావోలకు ఎదురుదెబ్బ

**లొంగిపోయిన వారిలో మల్లోజుల వేణుగోపాల్‌సహచరి తారక్క**

**ఆమెపై ఆమెపై రూ.కోటి రివార్డు**

**ముంబయి, జనవరి 1 :** మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఎదుట 11 మంది మావోయిస్టులు లొంగిపోయారు. బుధవారం గడ్చిరోలి జిల్లాలో సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ సమీక్షంలో ఈ మావోయిస్టులు లొంగిపోయారు. అయితే లొంగిపోయిన వారిలో.. తార్కా సిడం సైతం ఉన్నారు. గడ్చిరోలిలో గతంలో మావోయిస్టుల ప్రాబల్యం అధికంగా ఉండేదని.. అలాంటి ప్రాంతంలో పోలీసులు అవుట్ పోస్ట్ ఏర్పాటు చేశారన్నారు. అలాగే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతోందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. గడ్చిరోలి ప్రాంతాన్ని చత్తీస్‌గఢ్‌తో అనుసంధానం చేస్తూ.. రహదారిని అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. అలాగే మొబైల్ టవర్లు సైతం నిర్మిస్తున్నారని గుర్తు చేశారు. ఇక మహారాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు.. ఇటీవల నాగపూర్‌లో ముగిశాయి. ఈ సమావేశాల్లో సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ మాట్లాడుతూ.. గత ఏడాది 33 మంది మావోయిస్టులు ఎన్‌కౌంటర్‌లో మరణించారని చెప్పారు. ఇక గడ్చిరోలి జిల్లా ఉత్తర భాగం పూర్తిగా మావోయిస్టు రహిత ప్రాంతంగా మారిందని వివరించారు. అలాగే 55 మంది మావోయిస్టులను అరెస్ట్ చేయగా.. 33 మంది లొంగిపోయారని తెలిపారు. మావోయిస్టులపై తమ ప్రభుత్వం పోరాటాన్ని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఇక వామపక్ష తీవ్రవాదాన్ని అణిచివేసేందుకు మూడేళ్ల కాలపరిమి విధించుకున్నామని ఈ సందర్భంగా సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ గుర్తు చేశారు. మరోవైపు గడ్చిరోలి ప్రాంతానికి చెందిన వందలాది యువత పోలీస్ శాఖలో చేరారన్నారు. వారిలో 33 మంది యువకులు మావోయిస్టులు బాధితులు ఉన్నారని వివరించారు. ఇక మావోయిస్టుల అగ్రనేతలు సైతం లొంగి పోయి జనజీవన స్రవంతిలో కలిశారన్నారు. 2026, మార్చి మాసాంతం నాటికి దేశంలో మావోయిస్టులను నిర్మూలించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకొంది. అందుకోసం తనదైన శైలిలో ముందుకు వెళ్తుంది. ఇప్పటికే దేశంలోని చాలా రాష్టాల్లో మావోయిస్టుల ప్రభావం భాగా తగ్గిపోయింది. ఇంకా సోదాహరణగా చెప్పాలంటే.. తెలుగు రాష్ట్రాలు, జార్ఖండ్, బిహార్, ఉత్తరప్రదేశ్ తదితర రాష్టాల్లో వారి ప్రాబల్యం దాదాపుగా తుడిచి పెట్టుకుపోయింది. ఇక ఛత్తీస్‌గఢ్‌లో మాత్రం వారి ప్రాబల్యం కొంత స్పష్టంగా కనిపిస్తోంది. దీంతో ఆ రాష్ట్రంలో సైతం భద్రత దళాలు, స్థానిక పోలీసుల సహయంలో కూబింగ్ తీవ్రతరం చేసింది. అందులోభాగంగా పలు ఎన్‌కౌంటర్లు సైతం చోటు చేసుకున్నాయి. ఎన్‌కౌంటర్లలో దాదాపు 27 మంది అగ్రనేతలు మరణించిన విషయం విధితమే. ఇక దేశంలో మావోయిస్టుల నిర్మూలన కోసం .. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఉన్నతాధికారులతో ఎప్పటికప్పుడు సమిక్షలు నిర్వహిస్తూ.. కీలక సూచనలు చేస్తున్నారు.

# డీఏపీపై సబ్సిడీ పెంపు

మొదటి పేజీ తరువాయి

తీసుకున్న ఈ నిర్ణయంతో దేశవ్యాప్తంగా 4 కోట్ల మంది రైతులకు లబ్ధి చూకూరనున్నది. అలాగే, 'ఫండ్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ'కి కేంద్రం రూ.800 కోట్ల నిధిని ఏర్పాటు చేసింది. పీఎం కిసాన్ సమ్మాన్ యోజన పథకం కింద అందించే మొత్తాన్ని రూ.6 వేల నుంచి రూ.10 వేలకు పెంచాలని నిర్ణయించింది. దేశవ్యాప్తంగా కొనసాగుతున్న పలు ముఖ్యమైన ప్రాజెక్టులపై ఆయా రాష్ట్ర ప్రభుత్వాల ప్రతిపాదనలపై కూడా ఈ సమావేశంలో చర్చించినట్లు తెలుస్తోంది. నిరుద్యోగులకు ప్రత్యేక శిక్షణ అందించేందుకు ఓ ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేయాలని కూడా సమావేశంలో నిర్ణయించినట్లు తెలిసింది. ఉద్యోగావకాశాలను కల్పించే విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలను కల్పించే విషయంలో కేంద్ర ప్రభుత్వం ఓ కీలక ప్రకటన చేయబోతోందని చెబుతున్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు కొత్త సంవత్సరంలో డీఏ (డియర్‌నెస్ అలవెన్స్)తో పాటు కరువు భత్యం పెంచే యోచనలో ఉంది, దీని వల్ల అదనంగా రూ. 9,000 కోట్ల భారం ప్రభుత్వంపై పడనున్నది. గతంలో పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలను, అలాగే కొత్త సంవత్సరంలో అడ్వాన్స్‌గా కొంత మొత్తాన్ని చెల్లించేందుకు కూడా ప్రభుత్వం సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. మొత్తం మీద, ఉద్యోగులతో పాటు వ్యవసాయ పంటలకు గిట్టుబాటు ధరల అంశం కూడా ఈ సమావేశంలో ప్రాధాన్యత పొందింది.



### 2025 కేబినెట్ రైతులకు అంకితం

కేంద్ర కేబినెట్ నిర్ణయాలపై ప్రధాని నరేంద్రమోదీ హర్షం వ్యక్తం చేస్తూ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. రైతుల సంక్షేమానికి పూర్తిగా కట్టుబడి ఉన్నామన్నారు. దేశానికి అన్నం పెట్టేందుకు శ్రమించే రైతన్నను చూసి గర్విస్తున్నామని పేర్కొన్నారు. 2025లో జరిగిన తొలి కేబినెట్ సమావేశాన్ని రైతుల శ్రేయస్సు కోసమే అంకితం చేశామని తెలిపారు. రైతుల విషయంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నందుకు సంతోషంగా ఉందన్నారు.

### రెండు పంటల బీమా పథకాలు పొడిగింపు

పీఎంఎఫ్‌బీవై, ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్‌పంటల బీమా పథకాలను కేంద్రం 2025-26 వరకు పొడిగించినట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. వీటిని 15వ ఆర్థిక సంఘం కాలానికనుగుణంగా పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. రెండు పథకాలకు 2020-21 నుంచి 2024-25 ఆర్థిక సంవత్సరం వరకు రూ.66,550 కోట్లు కేటాయించగా, దాన్ని 2021-22 నుంచి 2025-26 ఆర్థిక సంవత్సరాలకు రూ.69,515.71 కోట్లకు పెంచారు.

# విదేశీ పర్యటనకు సీఎం రేవంత్ రెడ్డి

శ్రీధర్ బాబు, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజన్, ఇతర ఉన్నతాధికారులు ఆ సదస్సులో పాల్గొననున్నారు. 2024లో దావోస్ పర్యటన సందర్భంగా సుమారు రూ.40వేల కోట్లకుపైగానే పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలను రాష్ట్ర ప్రభుత్వం వేర్వేరు కంపెనీలతో చేసుకుంది. అవి కార్యరూపం దాల్చి వేర్వేరు దశల్లో ఉన్నట్లు పరిశ్రమ వర్గాలు తెలిపారు. ప్రస్తుత దావోస్ పర్యటనలోనూ మరిన్ని పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా సీఎం బృందం ప్రణాళికలను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి దావోస్ పర్యటనకు ముందు ఆస్ట్రేలియా వెళ్లనున్నారు. ముందస్తు షెడ్యూల్ ప్రకారం ఈ నెల 13నే పర్యటనకు ఏర్పాట్లు చేయాలని భావించినా, సంక్రాంతి పండుగ తర్వాత 15న బయలుదేరే ఆలోచన చేస్తున్నారని సమాచారం. సీఎం రేవంత్ ఆస్ట్రేలియా పర్యటనలో ప్రభుత్వ సలహాదారు జితేందర్ రెడ్డి, క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనా రెడ్డి, ఎండీ సోనీ బాల, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ తదితరులు వెళ్లనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆస్ట్రేలియాలో క్వీన్స్‌లాండ్ క్రీడా విశ్వవిద్యాలయాన్ని వీరు పరిశీలిస్తారు. ఆస్ట్రేలియాలో మూడు నాలుగు రోజుల పాటు పర్యటించిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి బృందం జనవరి 19న సింగపూర్‌కు వెళ్లనున్నట్లు తెలుస్తోంది. అక్కడ రెండు రోజుల పాటు షాపింగ్ మాల్స్‌పై క్రీడా ప్రాంగణాల నిర్మాణాలను పరిశీలిస్తారు. సింగపూర్‌లో పారిశ్రామిక వేత్తల సమావేశంలోనూ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు పాల్గొంటారు. అనంతరం దావోస్‌కు చేరుకుని ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో పాల్గొననున్నారు.

# మన్మోహన్ స్మారక స్థలం ఎంపికపై కసరత్తు

**న్యూఢిల్లీ, జనవరి 1 :** మన్మోహన్ సింగ్ స్మారక చిహ్నం నిర్మించే ప్రక్రియను కేంద్రం ప్రారంభించింది. రాజ్‌ఘాట్, రాష్ట్రీయ స్మృతి స్థల్‌తో పాటు కిసాన్‌ఘాట్ సమీపంలో 1 నుంచి 1.5 ఎకరాల స్థలంలో స్మారక చిహ్నం కోసం ప్రతిపాదించినట్టు సమాచారం. పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ అధికారులు ఈ ప్రాంతాలను ఇప్పటికే పరిశీలించారు. ఈ రెండు స్థలాల్లో ఒక స్థలాన్ని ఎంచుకోవాలని మన్మోహన్ కుటుంబ సభ్యులకు సూచించినట్టు తెలుస్తోంది. కొత్త విధానం ప్రకారం, మెమోరియల్ కోసం స్థలాన్ని ట్రస్టుకు మాత్రమే కేటాయించాల్సి ఉంటుంది. ఆ కారణంగా ప్రాజెక్టు ప్రారంభించడానికి ముందు ట్రస్టు ఏర్పాటు కావాలి. ట్రస్టు ఏర్పాటయిన వెంటనే భూమి కేటాయింపు కోసం దరఖాస్తు చేసుకోవాలి. నిర్మాణం కోసం సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్‌తో ఎంఓయూపై సంతకం చేయాలి. మన్మోహన్ స్మారక చిహ్నం జవహర్‌లాల్, ఇందిరా, సంజయ్ స్మారకాలు ఉన్న రాజ్‌ఘాట్ సమీపంలో ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది.

# బీజేపీ తప్పులకు ఆర్‌ఎస్‌ఎస్ మద్దతిస్తుందా?

**న్యూఢిల్లీ, జనవరి 1 :** దేశ రాజధాని ఢిల్లీలో ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), బీజేపీ మధ్య మాటల యుద్ధం కొనసాగుతున్నది. ఈ నేపథ్యంలో బీజేపీ సైద్ధాంతిక మాతృసంస్థ ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌కు ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ లేఖ రాశారు. కొత్త ఏడాది ఆరంభమైన బుధవారం, బీజేపీ రాజకీయాలకు సంబంధించి పలు ప్రశ్నలు సంధించారు. బీజేపీ తప్పులకు ఆర్‌ఎస్‌ఎస్ మద్దతిస్తుందా? అని కేజ్రీవాల్ నిలదీశారు. 'బీజేపీ నేతలు బహిరంగంగా డబ్బులు పంచుతున్నారు. ఓట్లు కొనేందుకు ఆర్‌ఎస్‌ఎస్ మద్దతిస్తుందా? దళిత, పూర్వాంచల్ ప్రజల ఓటర్లను పెద్ద ఎత్తున ఓటరు జాబితాల నుంచి తొలగిస్తున్నారు. ప్రజాస్వామ్యానికి ఇది మంచిదని ఆర్‌ఎస్-ఎస్ భావిస్తుందా? ప్రజాస్వామ్యాన్ని బీజేపీ నిర్వీర్యం చేస్తోందా?' అని కేజ్రీవాల్ ఆ లేఖలో ప్రశ్నించారు. కాగా, కేజ్రీవాల్ లేఖపై బీజేపీ ఘాటుగా స్పందించింది. 'అబద్ధాలు, మోసం అనే మీ తప్పుడు అలవాట్లను వదిలిపెట్టి మీలో అర్థవంతమైన మార్పు తీసుకువస్తారని ఆశిస్తున్నాం' అని ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవా అన్నారు. ఈ మేరకు అరవింద్ కేజ్రీవాల్‌కు తాను లేఖ రాసినట్లు ఆయన వెల్లడించారు.

# మేడ్చల్, శామీర్‌పేట్ వరకు మెట్రో రైలు



**హైదరాబాద్, జనవరి 1 :** రాష్ట్ర ప్రభుత్వం నగర వాసులకు తీపి కబురు చెప్పింది. మెట్రో రైలు పొడిగింపులో కీలక అడుగు వేసింది. హైదరాబాద్ ఉత్తర భాగం నగరవాసుల మెట్రో రైల్ కల నెరవేరబోతోంది. హైదరాబాద్ నార్త్ సిటీ వాసులకు నూతన సంవత్సర కానుకగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్యారడైజ్- మేడ్చల్ (23 కిలోమీటర్లు), జేబీఎస్-శామీర్‌పేట్ (22 కిలోమీటర్లు) మెట్రో కారిడార్ల డీపీఆర్‌ల తయారీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. వెంటనే డీపీఆర్‌లను సిద్ధం చేసి మెట్రో రైల్ ఫేజ్-2 'బి'లో భాగంగా కేంద్ర ప్రభుత్వ అనుమతికి పంపించాలని హెచ్‌ఎంఆర్‌ఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డిని ఆదేశించారు. పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్, హెచ్‌ఎంఆర్‌ఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డితో ఈ రెండు కారిడార్ల డీపీఆర్ తయారీ విషయంపై చర్చించి ఈ మేరకు సీఎం కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్యారడైజ్ మెట్రో స్టేషన్ నుంచి తాడ్‌బండ్, బోయిన్‌పల్లి, సుచిత్ర సర్కిల్, కొంపల్లి, గుండ్లపోచంపల్లి, కండ్లకోయ, ఆర్‌ఆర్‌ఆర్ ఎగ్జిట్ మీదుగా మేడ్చల్ వరకు దాదాపు 23 కిలోమీటర్ల కారిడార్ ఉంటుంది. జేబీఎస్ మెట్రో స్టేషన్ నుంచి విక్రమ్‌పురి, కార్ఖానా, తిరుమలగిరి, లోతుకుంట, ఆల్వాల్, బొల్లారం, హకీంపేట్, తూముకుంట, ఓఆర్‌ఆర్ ఎగ్జిట్ మీదుగా శామీర్‌పేట్‌కు 22 కిలోమీటర్ల మేర ఈ కారిడార్ విస్తరించి ఉంటుందని మెట్రో ఎండీ.. సీఎంకు వివరించారు. మల్కాజిగిరి ఎంపీగా ఉన్నప్పుడు ఈ ప్రాంతం ట్రాఫిక్ సమస్యలపై, ఈ కారిడార్ల రూట్ మ్యాప్‌లపై తనకు మంచి అవగాహన ఉందని సీఎం ప్రస్తావించారు. రూట్ మ్యాప్ విషయంలో ప్రస్తుత మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు కూడా వివరించి ఆయన సూచనలు, సలహాలు తీసుకోవాలని మెట్రో ఎండీని సీఎం ఆదేశించారు. డీపీఆర్ తయారీని 3 నెలల్లో పూర్తి చేసి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి తీసుకోవాలని సీఎం సూచించినట్టు మెట్రో ఎండీ తెలిపారు. మెట్రో ఫేజ్-2 'ఏ' భాగం మాదిరిగానే 'బి' భాగాన్ని కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్ ప్రాజెక్టుగా రూపొందించాలని సీఎం ఆదేశించినట్టు చెప్పారు. ఈ ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం అనుమతి కోసం పంపించాలని ముఖ్యమంత్రి ఆదేశించారని.. ఈ మేరకు వెంటనే డీపీఆర్, ఇతర అనుబంధ డాక్యుమెంట్ల తయారీ చేపడుతున్నట్టు మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి వివరించారు.

# జూబ్లీ బస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ

**సౌకర్యాలపై ప్రయాణికులతో మంత్రి పొన్నం ఆరా**




**హైదరాబాద్,జనవరి1 :** సికింద్రాబాద్ జూబ్లీ బస్ స్టేషన్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకస్మిక తనిఖీ చేశారు. జేబీఎస్‌లో ప్రయాణికులతో మంత్రి పొన్నం ప్రభాకర్ ముచ్చటించారు. బస్ స్టేషన్‌లో టాయిలెట్స్ పరిశీలించారు.. రోడ్డు భద్రతా మాసంలో భాగంగా డ్రైవర్ లతో మాట్లాడి రోడ్డు భద్రత పై అవగాహన కల్పించాలని సూచించారు.. క్యాంటీన్ లో ఆర్టీసీ ఉద్యోగులతో మాట్లాడారు.. క్యాంటీన్ లో నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు. ఏశిబ లో ఉన్న కార్గో సెంటర్ ను పరిశీలించారు.. రోజూ ఇక్కడి నుండి వెళ్ళే ప్రయాణికులు సంఖ్య కార్గో ,పార్శిల్ లు ఎన్ని తదితర వాటి గురించి అడిగి తెలుసుకున్నారు..శానిటేషన్ సిబ్బంది తో మాట్లాడారు. బస్ స్టేషన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండలని సూచించారు. బస్ స్టేషన్ లో ఉన్న షాపులను పరిశీలించారు . షాపులలో నాణ్యమైన ఆహార వస్తువులు ఉండాలని,కాలం చెల్లిన ఆహార వస్తువులు ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.. స్టాల్స్ లో అదనపు రేట్లకు వస్తువులు అమ్మరాదని ఒకవేళ అలాంటి పిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.. డ్రింకింగ్ వాటర్ ను పరిశీలించారు.. ఎ÷-లాట్ ఫాం లను పరిశీలించారు. ఎ÷-లాట్ ఫాం లపై డిస్ ప్లే బోర్డులు కనిపించే విధంగా ఉండాలని సూచించారు. ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు.. మంత్రి పొన్నం ప్రభాకర్ వెంట జిల్లా కలెక్టర్ అనుదీప్ దురశెట్టి ఇతర అధికారులు ఉన్నారు..

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
గురువారం 2
జనవరి 2025





# గుట్టలో 'న్యూ ఇయర్' కోలాహలం...!!



ఫస్ట్ జనవరికి మస్తుగా పోటెత్తిన భక్తులు

మార్నింగ్ నుంచి నైట్ వరకు ఎడతెరుపు లేని సందడి

శోభాయమానం...గుట్ట ఆలయ పరిసరాలు

హరిహరులను దర్శించుకుని తరించిన భక్తజనం

ధర్మదర్శనానికి 4, స్పెషల్ దర్శనానికి గంటన్నర సమయం











యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: హరిహరులకు నిలయమైన యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రానికి బుధవారం 'న్యూ ఇయర్' శోభ సంతరించుకుంది. కొత్త సంవత్సరం ఫస్ట్ జనవరి కావడంతో.. హైదరాబాద్ సహా రాష్ట్ర నలుమూలలతో పాటు స్థానిక ప్రజలు కూడా యాదగిరిగుట్టకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పంచనారసింహుడు, శివకేశవులను దర్శించుకోవడం కోసం భక్తులు పోటెత్తారు. కొత్త ఏడాది తొలిరోజున స్వామివారిని దర్శించుకుంటే ఏడాదంతా మంచి జరుగుతుందని భక్తుల నమ్మితారు. దీంతో ఆలయానికి భక్తులు తండోపతండాలుగా తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి. దర్శన, లడ్డూప్రసాద క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి. కొండపైన కనుచూపు మేరలో ఎక్కడ చూసినా భక్తుల హడావుడే కనిపించింది. కొండ కింద కల్యాణకట్ట, లక్ష్మీపుష్కరిణి, సత్యనారాయణస్వామి వ్రత మండపాలు.. కొండపైన బస్ బే, ప్రధానాలయ ప్రాంగణం, ఆలయ పరిసరాలు, క్యూకాంప్లెక్స్, దర్శన, ప్రసాద క్యూలైన్లు భక్తులతో నిండుగా కనిపించాయి. ఇక శివాలయంలో భక్తులు పర్వత వర్ధనీ సమేత రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పార్వతీ పరమేశ్వరులకు పంచామృతాలతో నిజాభిషేకం, బిల్వపత్రాలతో అర్చనలు చేశారు.

## ఉదయం 7:15 నుండి రాత్రి 9 వరకు నాన్ స్టాప్ దర్శనాలు

న్యూ ఇయర్ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారని ముందే ఊహించిన ఆలయ ఆఫీసర్లు.. బుధవారం ఉదయం 7:15 నుండి రాత్రి 9 గంటల వరకు నాన్ స్టాప్ గా దర్శనాలు కొనసాగించారు. మధ్యమధ్యలో బ్రేక్ దర్శనాలు, స్వామివారికి నివేదన, ఆరగింపు కైంకర్యాలు చేపట్టారు. రద్దీకి సరిపడా లడ్డూ, పులిహోర ప్రసాదాన్ని అందుబాటులో ఉంచిన ఆఫీసర్లు.. ఉదయం 5 గంటల నుండే ప్రసాద కౌంటర్లు తెరిచారు. కుటుంబ సమేతంగా పిల్లాపాపలతో కలిసి యాదగిరిగుట్టకు వచ్చిన భక్తులు, లక్ష్మీనరసింహులను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. యాదగిరిగుట్ట కు భక్తుల తాకిడి పెరగడంతో స్వామివారి దర్శనం కోసం గంటల తరబడి క్యూలైన్లలో నిరీక్షించారు. దీంతో స్వామివారి ధర్మదర్శనానికి 4 గంటలు, స్పెషల్ దర్శనానికి గంటన్నర సమయం పట్టిందని భక్తులు తెలిపారు. ఇక కొత్త సంవత్సరం దృష్ట్యా యాదగిరిగుట్టకు భక్తులు భారీగా తరలివస్తారనే సమాచారంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా యాదగిరిగుట్టలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. యాదగిరిగుట్ట ట్రాఫిక్ సీఐ కృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు, 50 మంది ఎస్పీఎఫ్ సిబ్బందితో స్పెషల్ బందోబస్తు ఏర్పాటు చేశారు. యాదగిరిగుట్టలో మూడు చోట్ల స్పెషల్ చెక్ పోస్టులు, నిరంతర నిఘా ఏర్పాటు చేసి భక్తులకు ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకోవడంతో.. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చినా ట్రాఫిక్ సమస్యలు తలెత్తలేదు.

## శ్రీస్వామి వారి ఆదాయ వివరాలు

రూ.83, 26, 642 ఆదాయం సమకూరినట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎన్ భాస్కరరావు తెలిపారు. శ్రీ స్వామి వారికి 1020మంది భక్తులు తలనీలాలు సమర్పించారని చెప్పారు.

| | |
|---|---|
| కళ్యాణ కట్ట. | 51,000/- |
| ప్రధాన బుకింగ్ | 2,77,500 /- |
| కైంకర్యములు | 4,800 /- |
| సుప్రభాతం | 29,200 /- |
| బ్రేక్ దర్శనం | 8,00,700 /- |
| వ్రతాలు | 72,800 /- |
| వాహన పూజలు | 21,100/- |
| %ఎXప్రా% దర్శనం. | 17,40,000 /- |
| ప్రచారశాఖ | 1,69,250 /- |
| పాతగుట్ట | 62,460 /- |
| కొండపైకి వాహన ప్రవేశం | 9,00,000/- |
| యాదఋషి నిలయం | 1,38,802/- |
| సువర్ణ పుష్పార్చన | 2,17,600/- |
| శివాలయం | 22,400 /- |
| శాశ్వత పూజలు | 67,500 /- |
| పుష్కరిణి | 3,300 /- |
| ప్రసాదవిక్రయం | 30,06,030 /- |
| లాకర్స్ | 440 /- |
| అన్నదానం. | 68,873 /- |
| విమాన గోపురం | 88,601/- |
| లీజెస్. | 5,73,100 /- |
| ఇతరములు | 11,186/- |

## శ్రీలక్ష్మీ నృసింహుని సేవలో ఎమ్మెల్యే గడ్డం వినోద్

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామిని బుధవారం బెల్లంపల్లి ఎమ్మెల్యే, మాజీ మంత్రి గడ్డం వినోద్ వెంకటస్వామి దర్శించుకున్నారు. ఫ్యామిలీతో కలిసి గర్భగుడిలో స్వయంభూ నారసింహుడిని దర్శించుకుని ప్రధానాలయ ముఖ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులకు అష్టోత్తర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు మంచి పాలన అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్న అయన.. ఇందుకోసం సీఎం రేవంత్ రెడ్డి త్రికరణ శుద్ధితో పని చేస్తున్నారన్నారు. ప్రజలకు మరింత ఎక్కువగా అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అందించడం కోసం సీఎం రేవంత్ రెడ్డికి మరింత శక్తిని ప్రసాదించాలని ప్రార్థించామన్నారు. రాష్ట్ర ప్రజలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పాడిపంటలతో సుభిక్షంగా, సుఖసంతోషాలతో ఉండేలా చూడాలని స్వామివారిని ప్రార్థించానని పేర్కొన్నారు. అంతకుముందు ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం తెలిపారు. దర్శనం అనంతరం ఆశీర్వచన మండపంలో అర్చకులు ఆయనకు వేద ఆశీర్వచనం చేయగా.. ఆలయ భాస్కర్ రావు లడ్డూప్రసాదం, స్వామివారి శేషవస్త్రాలు అందజేసి నారసింహుడి ఫోటోను బహుకరించారు. అదేవిధంగా ఉదయం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామివారి దర్శనం కల్పించి ఆశీర్వచనం చేశారు.



ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక

గురువారం 2
జనవరి 2025





# గుట్ట 'నర్సన్న'కు రికార్డు ఆదాయం

**గుట్ట గుడికి భారీగా తరలి వచ్చిన భక్తజనం**

**న్యూ ఇయర్ తొలి రోజే రూ.83.26 లక్షల ఆమ్దానీ**

**గతేడాది జనవరి ఫస్టున వచ్చిన ఆదాయం రూ.76.78 లక్షలు**

**2024 జనవరి ఒకటి వచ్చిన ఆదాయం కంటే ఈసారి రూ.6.48 లక్షలు అధికం**

**ఖుషీ...ఖుషీగా ఆలయాధికారులు**

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: న్యూ ఇయర్ సందర్భంగా బుధవారం యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి రికార్డుస్థాయి ఆదాయం సమకూరింది. జనవరి ఫస్టున స్వామివారిని దర్శించుకోవడానికి పెద్ద సంఖ్యలో యాదగిరిగుట్టకు తరలివచ్చిన భక్తులు జరిపించిన పలు రకాల పూజలు, నిత్య కైంకర్యాల ద్వారా బుధవారం ఆలయానికి రూ. 83,26,642 ఆదాయం వచ్చింది. ఇవి కాకుండా హుండీలలో భక్తులు సమర్పించిన నగదు కూడా భారీ ఎత్తున ఉండే అవకాశం ఉందని దేవస్థానం అధికారులు అంచనా వేస్తున్నారు. 2024 జనవరి ఒకటిన వచ్చిన ఆదాయాన్ని బుధవారం జనవరి ఫస్టున వచ్చిన ఆదాయం బీట్ చేసింది. 2024 జనవరి ఒకటిన ఆలయానికి రూ. 76,78,268 ఆదాయం రాగా.. ఈసారి దానిని అధిగమిస్తూ రూ. 83,26,642 ఇన్ కమ్ వచ్చింది. లాస్ట్ ఇయర్ జనవరి ఒకటిన వచ్చిన ఆదాయంతో పోల్చితే ఈసారి రూ. 6,48,374 ఇన్ కమ్ అధికంగా సమకూరింది. ఇందులో ఎక్కువగా





ప్రసాద విక్రయం ద్వారా రూ. 30,06,030, ప్రధాన బుకింగ్ తో రూ. 2,77,500, వీఐపీ దర్శనాల ద్వారా రూ. 17.40 లక్షలు, బ్రేక్ దర్శనాలతో రూ. 8,00,700, కొండపైకి వాహనాల ప్రవేశంతో రూ. 9 లక్షలు, సువర్ణ పుష్పార్చన ద్వారా రూ. 2,17,600, యాదరుషి నిలయం ద్వారా రూ. 1,38,802 ఆదాయం సమకూరింది. కేవలం రూ. 150ల వీఐపీ టికెట్ల ద్వారా 11,600 మంది భక్తులు, బ్రేక్ దర్శనాల ద్వారా 2,669 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారని ఆలయ ఆఫీసర్లు వెల్లడించారు.

## గుట్ట గుడికి వీఐపీల 'క్యూ'

న్యూ ఇయర్ ను పురస్కరించుకుని యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకోవడానికి బుధవారం పలువురు ప్రముఖులు ఆలయానికి క్యూ కట్టారు. రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ కుమార్, హైకోర్టు జడ్జి జస్టిస్ రాధారాణి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ఐఏఎస్ అధికారి గౌతమ్ వేర్వేరు సమయాల్లో వారి ఫ్యామిలీలతో కలిసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శనం కల్పించగా.. ఆలయ ఈవో భాస్కర్ రావు లడ్డూప్రసాదం, స్వామివారి శేషవస్త్రాలు అందజేశారు.

# అనంతరం గురుకుల స్కూల్ కు ఇన్వర్టర్ బహూకరణ

**బోడుప్పల్ కార్పోరేటర్ సీస వెంకటేష్ గౌడ్**

**విద్యార్థుల కోసం నా వంతు సహాయ సహకారాలు అందిస్తా: సీసా వెంకటేష్ గౌడ్**

**బోడుప్పల్ కార్పోరేటర్ సీస వెంకటేష్ గౌడ్ ను ఘనంగా సత్కరించిన పాఠశాల బృందం**





యాదాద్రి భువనగిరి డిసెంబర్ రోమింగ్ న్యూస్ ప్రతినిధి : భువనగిరి మండలం అనంతారంలోని బీసీ గురుకుల మహాత్మా జ్యోతిబాపూలే బీసీ రెసిడెన్షియల్ ఎస్ ఓ ఈ గురుకుల పాఠశాలలో బోడుప్పల్ కార్పోరేటర్ సీస వెంకటేష్ గౌడ్ విద్యార్థుల కోసం ఇన్వర్టర్ ను నూతన సంవత్సరం కానుకగా పాఠశాలకు ఇవ్వడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ... పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని కంప్యూటర్ సిస్టంకు ఇన్వైటర్ ను స్కూల్ విద్యార్థుల కోసం ఇవ్వడం చాలా సంతోషంగా ఉందని, మునుముందు అనేక సేవా కార్యక్రమాలు కూడా చేయడానికి తన వంతు సహాయ సహకారాలు అందజేస్తనాని అని అన్నారు. ఈ పాఠశాల విద్యార్థులకు ఎల్లవేళలా అండగా ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్, కన్వీనర్ వీరమల్ల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ... పేద విద్యార్థుల కోసం స్కూల్ అవసరాల కోసం ఇన్వెర్టర్ ను ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్ కి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం పాల్గొన్నారు.

# జనగామలో ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

**ఎమ్మెల్యే పల్లా, చైర్మన్ జమున తదితరుల శుభాకాంక్షలు**

**పొదుపు డబ్బుల తో పేదలకు దుప్పట్లు పంచిన చిన్నారి**

జనగామ, జనవరి1: (రోమింగ్ న్యూస్) జనగాం జిల్లా వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు 2025 నూతన సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ మంగళవారం అర్ధరాత్రి నుండి బుధవారం దినమంతా ఉత్సాహంగా వేడుకలను జరుపుకున్నారు . చిన్న పెద్ద తేడా లేకుండా ఒకరికొకరు హ్యాపీ న్యూ ఇయర్ అంటూ శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ మిఠాయిలు, కేకులు పంచుకుంటూ ఆనందంగా పలకరించుకోవడం కనిపించింది. ఈ సందర్భంగా జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్



రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోకల జమున తదితరు ప్రముఖులు అనేకమంది అన్ని వర్గాల ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్ల రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ జనగామ జిల్లా ప్రజలకు రైతులకు ప్రతి ఎకరానికి సాగునీరు అదే విధంగా కృషి చేస్తామని ఈ విషయంలో ప్రభుత్వంతో పోరాడి రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తానని ఆయన మరోసారి గుర్తు చేశారు . నూతన సంవత్సరం సందర్భంగా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయాలంటూ ఆయన కోరారు. మరోవైపు జనగామ లోని ఉన్నపుర సెంటెనరీ బాప్టిస్ట్ చర్చి లో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. చర్చిలో జరిగిన వాచ్ నైట్ సర్వీస్ ప్రార్థన మరియు ఆరాధన తర్వాత చర్చి ప్రతినిధి రాజ్‌కుమార్ మరియు రజనీల ముద్దుల కూతురు రోషిణి క్లారిస్సా తాను పొదుపు పొదుపు చేసుకున్న డబ్బులను ఖర్చుచేసి పేదలకు నూతన సంవత్సర కానుకలుగా చర్చిలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలిచారు. ఇలా చిన్నారి తన పొదుపు డబ్బుల నుండి సేవా కార్యక్రమాలు చేయడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు చేయగాచేసింది.








# జనగామ అడిషనల్ ఎస్పీగా చేతన్

జనగామ,జనవరి 1( రోమింగ్ న్యూస్): జనగామ జిల్లా అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఏ ఎస్ పి) గా పండరి చేతన్ నితిన్ ఐపీఎస్ ఆఫీసర్ను నియమిస్తూ తెలంగాణ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జీవో జారీ చేయగా ఈరోజు బుధవారం జనగామలో ఆయన అడిషనల్ ఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు . రాష్ట్రవ్యాప్తంగా పదిమంది ఐపీఎస్ ఆఫీసర్లను నియమిస్తూ తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 1738 ప్రకారం జనగామ ఎస్పీగా చేతన్ నితిన్ జనగామ అడిషనల్ ఎస్పీగా నియమిస్తున్నట్లు తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది . బుధవారం ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన చేతన్ నితిన్ జనగామ జిల్లా ప్రజలకు అయిన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ, శాంతి, భద్రతలను కాపాడుతూ పోలీసులందరూ బాధ్యతాయుతంగా పనిచేస్తూ



ప్రజల మన్ననలను పొందాలని ఆయన కోరారు . బుధవారం జనగామ కు చేరుకున్న ఐపీఎస్ చేతన్ నితిన్ కు జనగామ డిప్యూటీ సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ రాజమహేంద్ర నాయక్ తో పాటు ఇతర పోలీసు అధికారులు పుష్పగుచ్చాలు అందజేస్తూ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం జనగామ జిల్లా పోలీసు అధికారులను

పరిచయం చేసుకుంటూ తన పరిచయాన్ని అందజేస్తూ జిల్లా స్థితిగతులను, శాంతి పర్యవేక్షణలను అడిగి తెలుసుకుంటూ అధికారులకు అడిషనల్ ఎస్పీ చేతన్ పలు సూచనలు చేశారు .



ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
గురువారం 2
జనవరి 2025





# ఫార్ములా ఈ కేసు లొట్టపీసు కేసు

- ఏదో రకంగా జైలుకు పంపాలని చూస్తున్నారు
- మీడియా సమావేశంలో కేటీఆర్ వ్యాఖ్యలు
- పార్టీ నేతలు, అభిమానుల న్యూ ఇయర్ శుభాకాంక్షలు



**హైదరాబాద్, జనవరి 1 :** కేసీఆర్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేయటానికి బీఆర్ఎస్ కార్యకర్తలు పని చేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. కొత్త సంవత్సరంలో బీఆర్ఎస్ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. పార్టీ కార్యాలయంలో పార్టీ అభిమానులు కెటిఆర్‌ను కలిసి అభినందనలు తెలిపారు. ఫార్ములా ఈ రేసు కేసుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. బుధవారం మీడియాతో కేటీఆర్ మాట్లాడుతూ.. ఫార్ములా ఈరేస్ కేసులో తెలంగాణ హైకోర్టులో ఏ తీర్పు వస్తుందో చూద్దామన్నారు. ఇందులో అవినీతే లేనప్పుడు.. కేసు ఎక్కడది అని ప్రశ్నించారు. ఏసీబీ ఎఫ్ఐఆర్ తప్పు అని వ్యాఖ్యలు చేశారు. ఈకేసులో ఈడీ ఎదుట ఈనెల 7న హాజరుపై తన లాయర్లు నిర్ణయిస్తారని తెలిపారు. ఏసీబీ కేసులో అస్సలు పస లేదని..తనకు న్యాయస్థానాల పై నమ్మకం ఉందన్నారు. ఫార్ములా ఈ కేసు లొట్టపీసు కేసు అంటూ వ్యాఖ్యలు చేశారు. 'పాపం.. నన్ను ఏదో రకంగా జైలుకు పంపాలని ప్రభుత్వం చూస్తోంది. నాపై ఇది ఆరో ప్రయత్నం.. రేవంత్‌కు ఏమీ దొరకటం లేదు' అంటూ సెటైర్ విసిరారు. రూ.600 కోట్ల సంగతి అటుంచితే.. పైసా కూడా అవినీతి లేదన్నారు.జడ్జి అడిగే ప్రశ్నలకు ఏజీ దగ్గర సమాధానం లేదన్నారు. రేసు కావాలని తాను నిర్ణయం తీసుకున్నాని.. వద్దనేది రేవంత్ నిర్ణయమన్నారు. ఇద్దరి నిర్ణయాలపై క్యాబినెట్‌లో చర్చ జరగలేదన్నారు. 'నాపై కేసు పెడితే.. రేవంత్‌పై కూడా కేసు పెట్టాలి. రేవంత్ రెడ్డి.. ఒక ముఖ్యమంత్రినా?' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌కు ఎదురయ్యే చిన్న, చిన్న అడ్డంకులను అధిగమించి లక్ష్యాన్ని సాధించాలని అన్నారు. రాష్ట్రం, దేశ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం ఏప్రిల్ 27న భారీ బహిరంగ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏడాది మెదటి హాఫ్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉంటుందన్నారు. తర్వాత గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి కమిటీలు పూర్తి చేస్తామన్నారు. పార్టీ అధ్యక్షుడి ఎన్నికకు.. వచ్చే అక్టోబర్ వరకు సమయముందని తెలిపారు. పార్టీ నేతలకు శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చూపిస్తామని స్పష్టం చేశారు. రైతుబరోసాతో రేవంత్ సర్కార్‌పై ప్రజల్లో తిరుగుబాటు రాబోతోందన్నారు. రైతుభరోసా కొందరికికే ఇచ్చే ప్రయత్నం జరుగుతోందని తెలిపారు. రైతులకు సెల్ఫ్ డిక్లరేషన్ ఎందుకు అని ప్రశ్నించారు. బ్యాంకులను ముంచేటోళ్ళకే సెల్ఫ్ డిక్లరేషన్ లేదన్నారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజిస్ట్రేషన్లు ఇవ్వాలని రేవంత్‌కు లేదని విమర్శించారు. 42 శాతం రిజర్వేషన్లపై ప్రభుత్వమే కోర్టులో కేసులు వేయిస్తోందన్నారు. ఉద్యోగస్తులు, పాన్ కార్డ్ ఉన్నవాళ్ళకు రైతుభరోసా ఎగ్గొట్టే ప్రయత్నం జరుగుతోందని కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు.

## చరిత్రలో కేసీఆర్ నిలిచిపోతారు

- ఎవరి వల్ల కానిది కేవలం కేసీఆర్ వల్లే సాధ్యమైంది
- మళ్లీ సీఎం అయితేనే రాష్ట్రం బాగు
- మాజీ మంత్రి కేటీఆర్

**హైదరాబాద్, జనవరి 1 :** చరిత్రలో కేసీఆర్ ఎప్పటికీ నిలిచిపోతారని, ఎవరి వల్ల కానిది కేసీఆర్ వల్లే సాధ్యం అయిందని అది అందరికీ తెలుసునని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. తెలంగాణ ఉద్యమ రథసారథి కేసీఆర్.. చావునోట్లో తలపెట్టి తెలంగాణ సాధించిన నాయకుడు అని పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ క్యాలెండర్ ఆవిష్కరణ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. ఆంగ్ల నూతన సంవత్సరం మొదటి రోజున తెలంగాణ భవన్‌కు విచ్చేసి బీఆర్ఎస్ నాయకత్వం మొత్తం ఇక్కడ కొలువుదీరి బీఆర్ఎస్ క్యాలెండర్‌ను ఆవిష్కరించుకోవడం సంతోషంగా ఉంది. మనందరం మనస్ఫూర్తిగా కాంక్షిస్తున్నది ఒక్కటే.. చావునోట్లో తలపెట్టి తెలంగాణ సాధించిన నాయకుడు కేసీఆర్ తిరిగి రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావాలనే ఒకే ఒక్క కోరితో గట్టిగా పని చేస్తున్నాం. కేసీఆర్ నాయకత్వంలో మన పార్టీ మరిన్ని విజయాలు నమోదు చేయాలని, ప్రజల ఆశీస్సులు పూర్తిస్థాయిలో తిరిగి పొందాలని, మనకు ఎదురయ్యే అడ్డంకులు ఎదుర్కొనే శక్తి ఆ భగవంతుడు మీకు ప్రసాదించాలని, మీ కుటుంబాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తున్నాను. కులమతాలకు అతీతంగా, ఎలాంటి ఇబ్బంది లేకుండా ఈ దేశం, రాష్ట్రం ఎల్లవేళలా ప్రశాతంగా ఉండాలని మనస్ఫూర్తిగా కాంక్షిస్తున్నాను అని కేటీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ క్యాలెండర్ ఆవిష్కరణ సందర్భంగా కేటీఆర్‌కు గులాబీ శ్రేణులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ చేత కేటీఆర్ కేక్ కట్ చేయించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలిలో ప్రతిపక్ష నేత ఎమ్మెల్సీ మధుసూదనాచారి, ఎంపీ సురేశ్ రెడ్డి, మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, మల్లారెడ్డి, మహమూద్ అలీ, ఎర్రబెల్లి దయాకర్ రావుతోపాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.


# అదానీతో విద్యుత్ ఒప్పందం రద్దు

### తమిళనాడు ప్రభుత్వం కీలక నిర్ణయం




**చెన్నై, జనవరి 1 :** అదానీ కంపెనీతో విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేసుకున్నట్లు తమిళనాడు ప్రభుత్వం బుధవారం వెల్లడించింది. సౌర విద్యుత్ కాంట్రాక్టులను దక్కించుకునేందుకు అదానీ భారీ కుంభకోణానికి పాల్పడ్డారని ఇటీవల అమెరికా పత్రిక ÷నాన్షియల్ టైమ్స్ వెల్లడించిన సంగతి తెలిసిందే. అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ (ఎఇఎస్ఎల్)తో స్మార్ట్ మీటర్ల సేకరణ కోసం తమిళనాడు పవర్ డిస్టిబ్యూషన్ కార్పొరేషన్ ( టిఎఎన్‌జిఇడిసిఒ) చేసుకున్న ఒప్పందాన్ని స్టాలిన్ ప్రభుత్వం రద్దు చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అధిక ధరలను కోట్ చేశారని, అందుకే ఒప్పందాన్ని రద్దు చేసుకున్నట్లు ఆ వర్గాలు వెల్లడించాయి.కేంద్ర ప్రభుత్వ పథకం కింద 2023 ఆగస్టులో నాలుగు ప్యాకేజీలుగా టెండర్లు జరిగాయి. చెన్నై సహా ఎనిమిది జిల్లాలను కవర్ చేసే టెండర్‌లో ప్యాకేజీ 1కి కి అదానీ సంస్థ 82 లక్షలకు పైగా స్మార్ట్ మీటర్లను పంపిణీ చేసేందుకు ఒప్పందం కుదిరినట్లు ఆ వర్గాలు తెలిపాయి. అదానీ సంస్థ కోట్ చేసిన ధర అధికంగా ఉన్నందున డిసెంబర్ 27, 2024న టెండర్‌ను రద్దు చేసినట్లు వెల్లడించాయి. మరో మూడు ప్యాకేజీల టెండర్లను కూడా రద్దు చేశామని తెలిపింది. మరోసారి టెండర్లను ఆహ్వానించే అవకాశం ఉందని పేర్కొన్నాయి.2020-2024 మధ్య లాభదాయకమైన సౌర విద్యుత్ కాంట్రాక్టులను దక్కించుకోవడం కోసం అదానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో ఉన్నత స్థానాల్లో ఉన్న వ్యక్తులకు రూ.2029 కోట్ల ముడుపులు ముట్టజెప్పడం లేదా ఇస్తానని వాగ్దానం చేయడం వంటి చేశారని అమెరికా న్యాయశాఖ అక్కడి కోర్టుకు తెలియజేసింది. సెకీతో విద్యుత్ సరఫరా ఒప్పందాలు కుదుర్చుకునేలా ఆ వ్యక్తులు పలు రాష్ట్రాల విద్యుత్ పంపిణీ కంపెనీలను ఒప్పించారు. ఆ విధంగా కొన్ని రాష్ట్ర విద్యుత్ కంపెనీలు సెకీతో ఒప్పందం కుదుర్చుకున్నాయి. 2021 జులై, 2022 ఫిబ్రవరి మధ్య కాలంలో ఒరిస్సా, జమ్ము కాశ్మీర్, తమిళనాడు, చత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల విద్యుత్ పంపిణీ కంపెనీలతో ఒప్పందాలు జరిగాయి. ఇందుకు సంబంధించి 54 పేజీల నేరాభియోగ పత్రాన్ని న్యాయవాదులు కోర్టులో దాఖలు చేసినట్లు అమెరికా పత్రిక ÷నాన్సియల్ టైమ్స్ వెల్లడించిన సంగతి తెలిసిందే. ఆ అభియోగ పత్రంలోని వివరాలను ప్రముఖ అమెరికన్ పత్రిక ÷నాన్షియల్ టైమ్స్ వెల్లడించడంతో ఈ భాగోతం బయటపడింది. నేరాభియోగ పత్రంలో కేటగిరీల వారీగా, వ్యక్తుల వారీగా ఎవరికి ఎంతెంత ముడుపులు ముట్టజెప్పడం లేదా హామీ ఇవ్వడమో చేశారని స్పష్టంగా పేర్కొనడం జరిగింది. గౌతమ్ అదానీ మేనల్లుడు సాగర్ అదానీని కూడా ఫెడరల్ ప్రాసిక్యూటర్లు

## ఐటి కంపెనీలో అగ్నిప్రమాదం



**హైదరాబాద్, జనవరి 1 :** మాదాపూర్ అయ్యప్ప సొసైటీలోని ఓ వాణిజ్య సముదాయంలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. భవనం ఐదో అంతస్తులోని నిపున్ ఐటీ సొల్యూషన్స్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో మంటలు చెలరేగాయి. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని రెండు ÷రిరజన్లతో మంటలు ఆర్పివేశారు. అగ్ని ప్రమాదంలో కార్యాలయంలోని సామగ్రి, ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిబూడిదయ్యాయి. వాణిజ్య సముదాయంలో మంటలు చెలరేగడంతో మిగిలిన కార్యాలయాల్లోని సిబ్బంది ఒక్కసారిగా బయటకు పరుగులు తీశారు.

## అపహరణకు గురైన వ్యాపారవేత్త హత్య

**హైదరాబాద్,జనవరి1 :** హైదరాబాద్ పంజాగుట్టలో అపహరణకు గురైన వ్యాపారవేత్త విష్ణురూపాని హత్యకు గురయ్యాడు. పంజాగుట్ట పోలీసుల కథనం ప్రకారం.. డిసెంబరు 29న పంజాగుట్టలో విష్ణురూపాని అదృశ్యమయ్యాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఎస్ఆర్ నగర్‌లోని బుద్ధనగర్‌లో ఓ గది నుంచి దుర్వాసన వస్తుండటంతో బుధవారం స్థానికులు పోలీసులకు సమాచారమందించారు. ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించగా.. గదిలో విష్ణురూపాని మృతదేహం పడి ఉంది. గదికి బయట నుంచి తాళం వేసి ఉండటంతో హత్య చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

## సూర్యపేట జిల్లాలో విషాదం

### వ్యక్తిని బలిగొన్న భూ తగాదాలు

**సూర్యాపేట, జనవరి 1 :** సూర్యాపేట జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. భూతగాదాలు ఓనిండు ప్రాణాన్ని బలితీసుకున్నాయి. నూతన సంవత్సర వేడుకలకు పిలిచి ఓ వ్యక్తిని దారుణంగా హతమార్చారు. ఈ విషాదకర సంఘటన చివ్వెంల మండలం లక్ష్మి తండాలో చోటు చేసుకుంది. తండాకు చెందిన ధరావత్ శేషు (39)కు అదే తండాకు చెందిన తన ప్రత్యర్థులతో కొంత కాలంగా భూ వివాదాలు చేటు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో శేషు ప్రత్యర్థులు న్యూఇయర్ వేడుకలకు పిలిచి కత్తితో గొంతు కోసి దారుణంగా హతమార్చారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. శేషు మృతితో తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# షరతుల పేరుతో రైతుల నోట్లో మట్టికొట్టే యత్నం

### రైతుభరోసాపై హరీష్ రావు విమర్శలు



సంగారెడ్డి, జనవరి 1 : షరతుల పేరిట రైతుల నోట్లో మట్టికొట్టే ప్రయత్నం చేస్తున్నారని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. బుధవారం సంగారెడ్డిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'పత్తి, చెరకు, పసుపు పంటలకు ఒకసారి మాత్రమే రైతు భరోసా ఇస్తామంటున్నారు. కొండలు, గుట్టలు సాగు చేసే వారికి రైతు భరోసా రాదని చెబుతున్నారు. ఇప్పుడు రైతు భరోసాకు కూడా షరతులు పెడుతున్నారు.రైతు భరోసా కోసం రైతుల నుంచి సెల్ఫ్ డిక్లరేషన్ తీసుకుంటారంట. బడా కంపెనీలు, కార్పొరేట్ వ్యాపారులకు మాత్రం ఎలాంటి షరతులు ఉండవు. రైతులను దోషిగా నిలబెట్టే ప్రయత్నం ఎందుకు చేస్తున్నారు? రైతులను మళ్లీ కార్యాలయాల చుట్టూ తిప్పే ప్రయత్నం చేస్తున్నారు. ఏ దరఖాస్తు లేకుండా భారాస ప్రభుత్వం రైతుబంధు ఇచ్చింది. కాంగ్రెస్ నాయకుల చుట్టూ రైతులు తిరగాలని ఈ ప్రభుత్వం చూస్తోంది. వరంగల్ డిక్లరేషన్‌లో చెప్పినట్టు ఎకరానికి రూ.15వేల చొప్పున ఇవ్వాలి. వానాకాలం, యాసంగి పంటలకు కలిపి ఒకేసారి రూ.15వేల చొప్పున ఇవ్వాలి' అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

#### సిద్ధి వినాయక ఆలయంలో హరీశ్‌రావు పూజలు

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గతంలో స్వయంభూ సిద్ధివినాయక ఆలయాన్ని ఎంతో అభివృద్ధి చేశారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. బుధవారం సంగారెడ్డి జిల్లా రేజింత్‌లో స్వయంభూ సిద్ధివినాయక 225వ జయంతి ఉత్సవాల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయ పాలక మండలి ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ..స్వయంభూ సిద్ధి వినాయక జయంతి ఉత్సవాల్లో పాల్గొన్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. సిద్ధి వినాయకుడు దినదినము ఆకారం పెంచుకుంటూ ఇక్కడికి వచ్చే భక్తుల కోరికలు నెరవేరుస్తూ వస్తున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక మహారాష్ట్ర, ఆస్ట్రేలియా నుంచి భక్తులు పెద్ద ఎత్తున ఇక్కడికి వచ్చి స్వామి దర్శనం చేసుకుంటున్నారని తెలిపారు. ప్రతి సంవత్సరం సిద్ధి వినాయక జయంతి ఉత్సవాలు గొప్పగా జరగడం సంతోషకరమైన విషయం. స్వామివారి పుష్పార్చన కార్యక్రమంలో పాల్గొనడం మరింత సంతోన్ని చ్చిందన్నారు. ఇలాంటి విశిష్టత ఉన్న సిద్ధి వినాయకుడిని మరెక్కడా మనం చూసి ఉండమన్నారు. నూతన సంవత్సర సందర్భంగా రాష్ట్ర ప్రజలందరూ సుఖ, సంతోషాలతో ఉండాలని ఆ భగవంతుడిని ప్రార్థించానన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నేతలు, తదితరులు ఉన్నారు.

# రాచకొండ పరిధిలో భారీగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు


### దాదాపు 619 కేసులు నమోదు

**హైదరాబాద్, జనవరి1 :** దేశ వ్యాప్తంగా న్యూఇయర్ సంబరాలు అంబరాన్ని అంటాయి. న్యూఇయర్ సందర్భంగా యువత ఎంతో ఉత్సాహంగా సెలబ్రేట్ చేసుకున్నారు. కొత్త సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికారు. న్యూఇయర్ వేడుకల్లో నో ఆల్కహాల్ అంటూ పోలీసులు చెప్పినప్పటికీ పట్టించుకోలేదు. ఎక్కడికక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తాగి వాహనాలు నడిపిన వారి పనిపట్టారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించి మందు సేవించిన వారిని పట్టుకున్నారు. వారిపై కేసులు కూడా నమోదు చేశారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ల పరిధిలో భారీగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు అయ్యాయి. పెద్ద సంఖ్యలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు పోలీసులు. బుదవారం ఉదయం వరకు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించారు. మందు సేవించి వాహనం నడిపిన అనేక మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. తనిఖీల్లో మద్యం సేవించిన అనేక మంది పోలీసులకు చిక్కారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో దాదాపు 619 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు అయ్యాయి. మల్కాజ్‌గిరి డివిజన్‌లో 230 కేసులు నమోదు కాగా భువనగిరి డివిజన్లో 84 కేసులు నమోదయ్యాయి. అలాగే ఎల్బీనగర్లో 232 కేసులు నమోదు అవగా.. మహేశ్వరంలో 47 కేసులు నమోదయ్యాయి. మరోవైపు పంజాగుట్టలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టిన పోలీసులు పెద్ద షాకే తగిలింది. వెంగల్‌రావు పార్క్ వద్ద మద్యం సేవించి వెళుతుండగా ఓ వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. సదరు వ్యక్తికి బ్రీత్ ఎన్‌లైజర్ టెస్ట్ నిర్వహించగా.. అందులో వచ్చిన సంఖ్య చూసి పోలీసులు అవాక్కయ్యారు. బ్రీత్ ఎనలైజర్ టెస్ట్‌లో 550 రీడింగ్ నమోదు అయ్యింది. 550 ఆల్కహాల్ రీడింగ్ రావడంతో ఆశ్చపోవడం పోలీసుల వంతైంది. వెంటనే ఆ వ్యక్తిపై కాప్స్ కేసు నమోదు చేశారు. అయితే డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికి 550 పాయింట్స్ వచ్చిన ఆ వ్యక్తి మాత్రం.. తాను రేవంత్ అన్న తాలూకా అంటూ పోలీసుల ఎదుట బుకాయింపుకు దిగాడు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
గురువారం 2 జనవరి 2025








# పాలకులు ఆత్మ విమర్శ చేసుకోవాలి!

దేశంతో పాటు ప్రపంచమంతా కొత్త సంవత్సరంలోకి అడుగిడిన వేళ..ప్రజలంతా కొత్త ఆశలు, ఆకాంక్షలతో ముందుకు సాగాలని కోరుకుంటున్న వేళ..రాజకీయ నాయకులు, పాలకులు కూడా అదే ఆశయాలతో ముందుకు సాగితే దేశం పురోగమిస్తుంది. కానీ రాజకీయ నాయకులు ఎల్లవేళలా ఓటుబ్యాంకు దృష్టిలోనే ఆలోచనలు చేస్తున్నారు. అదే కోణంలో పథకాలు గానీ, పనులుగానీ చేస్తున్నారు. దీంతో దేశం ముందుకు సాగడం లేదు. ధరల పెరుగుదల, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం,రూపాయి పతనం వంటి సమస్యలన్నీ మనం సృష్టించుకున్నవే. వాటిని పరిష్కరించుకునే ప్రయత్నం చేయడం లేదు. ధరల అదుపునకు చర్యలు లేవు. ఆహారధాన్యాలు ఉత్పత్తి అవుతున్నా..రైతులకు గిట్టుబాటు ధరలు దక్కడం లేదు. కొనుగోలుదారులు మాత్రం అధికధరలతో అవస్థలు పడుతున్నారు. ఇకపోతే 140కోట్ల మంది భారతీయులు ఉన్న మన దేశంలో కూలీల కొరతను ఎదుర్కొంటున్నాం. వ్యవసాయ కూలీలు దొరకడం లేదు. దీనికతంటికి పాలకుల విధానాలే కారణం. ఉచిత పథకాలతో ప్రజలను సోమరులను చేసి, పనులకు దూరం చేస్తున్నారు. ఈ సమస్యలపై చర్చించి ముందుకు సాగాలన్న బలమైన సంకల్పం పాలకుల్లో కొరవడింది. ఐదేళ్లు గడిచేలోగా..మరో ఐదేళ్లకు వేసుకునే ప్రణాళికలతో పాలకులు సాగుతున్నారు. సమిష్టి కృషితో దేశాన్ని ముందుకు నడిపిస్తు న్నామని ప్రధాని మోడీ నూతన సంవత్సరానికి ముందు ప్రకటించారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. అలా అయితే భారతదేశం పురోగమించదని, ప్రజలు సమస్యలు, అప్పులు, పన్నుల భారం నుంచి బయటపడరని ప్రధాని మోడీ గుర్తించడం లేదు. ఇకపోతే భాగస్వామ్య పక్షాలుగా ఉన్నా టిడిపి,జనసేన తదితర పార్టీలు కూడా చొరవ తీసుకుని మంచి సలహాలు కూడా ఇవ్వలేక పోతున్నాయి. పెన్షన్లు 4వేలకు పెంచి పంచడమే గొప్ప ఘన కార్యాంగా ఎపి సిఎం చంద్రబాబు భావిస్తున్నారు. మంత్రులు, పార్టీ పెద్దల సలహాలు తీసుకుని పాటించే ఆనవాయితీ మోడీకి ఎలాగూ లేదు. కనీసం భాగస్వామ్య పక్షాలతో అయినా చర్చించే పరిస్థితి లేదు. ఇకపోతే గతేడాది అనేక ముఖ్య ఘట్టాలను మనం పరిశీలించవచ్చు. దేశ రాజకీయాలకు సంబంధించినంత వరకు 2024 ఒక చారిత్రక ఘట్టంగా భావించాలి. కొడిగట్టి పోతున్న కాంగ్రెస్‌కు నూనె పోసి దీపం వెలిగించిన ఘనత మోడీదే. మోడీ నిరంకుశ విధానాలతో కాంగ్రెస్ మళ్లీ బతికి బట్టకట్టింది. అయోధ్యలో రామమందిర నిర్మాణం జరిగి శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ఠ జరగడం ప్రపంచ వ్యాప్తంగా పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్నాం. కానీ అయోధ్యలోనే బిజెపి పతనం చెందింది. కారణమేమంటే అక్కడి స్థానికులకు లబ్ది కలిగేలా, వారికి దారి చూపేలా పథకాలు అమలు కాలేదు. అయితే గత సంవత్సరం భారతీయ జనతా పార్టీకి సంబంధించి అత్యంత కీలకమైనదిగానే చెప్పుకోవాలి. రామమందిర నిర్మాణం జరిగిన వెంటనే మోదీ ఎన్నికలకు వెళ్లి ఉంటే ఏమి జరిగేదో కాని, ఆయన ఉన్నట్లుండి వ్యూహం మార్చి పూర్తిగా మోదీ పేరుతోనే ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. దేశమంతటా మోదీ అనే వ్యక్తి ఆధారంగానే బీజేపీ ఎన్నికల బరిలోకి దిగింది. తన పేరు చెబితే దేశం దేశం ఏకమై ఉవ్వెత్తున జనం ముందుకు వచ్చి ఓటు వేస్తారని ఊహించుకున్న మోదీ 400 సీట్లు సాధిస్తామని చెప్పుకున్నారు. కాని ఈ ప్రయోగం అంతగా సఫలీకృతం కాకపోవడంతో బీజేపీ కేవలం 240 సీట్లకే పరిమితమయింది. ఇదో రకంగా మోడీకి శరాఘాతంగా భావించాలి. ఈ విఘాతాన్ని అధిగమించాలంటే హరియాణా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించడం తప్పదని మోదీ గ్రహించారు. అందుకే అన్నిశక్తులూ ఒడ్డి, అన్ని రకాల వ్యూహాలు పన్ని ఈ రెండు రాష్టాల్లో బీజేపీ గెలుపొందేలా చేయడంతో దేశ రాజకీయ చిత్రపటంపై తనకు తిరుగులేదని అనిపించుకున్నారు. ఎన్నికల్లో గెలవడం తెలుసుకున్న మోడీ ప్రజల మనసులను మాత్రం గెలవలేకపోతున్నారు. ఆయన అనుసరిస్తున్న ఆర్థిక విధానాలు ప్రజలను నరకయాతన పెడుతున్నా సమీక్షించుకోవడం లేదు. ఈ క్రమంలో 2025 ప్రధానమంత్రి నరేంద్రమోదీ, బీజేపీకి సంబంధించి కీలక సంవత్సరంగా భావించాలి. మారుతున్న ప్రపంచ రాజకీయాల నేపథ్యంలో భారత్‌లో కూడా మార్పులు రావాల్సి ఉంది. రాజ్యాంగం, కులగణన, అదానీ కుంభకోణం వంటి అంశాలను లేవనెత్తుతున్న కాంగ్రెస్‌ను ఎదుర్కోవడం కూడా అంత సులభం కాదు. పార్లమెంట్ చర్చలకు వేదిక కాకుండా కుమ్ములాటలకు రంగస్థలం కావడంపై ప్రతిపక్షాల కంటే మోదీయే జవాబుదారీ కావల్సి ఉంటుంది. మోడీ ఇంతవరకు గట్టిగా నిలబడి ఏదేని సమస్యపై చర్చించిన దాఖలాలు లేవు. పార్లమెంట్‌లో చర్చలకు అవకాశం లేకుండా పోతున్నది. 2024లో దేశంలో దాదాపు పది సంవత్సరాల తర్వాత జాతీయ స్థాయిలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడడం, ఈ ప్రభుత్వంలో తెలుగుదేశం వంటి దక్షిణాది పార్టీ ప్రధాన భాగస్వామి కావడం, ప్రధాన రాజకీయ పార్టీలు రెండు ప్రధాన కూటములుగా ఏర్పడడం మరో ముఖ్యమైన పరిణామం అని చెప్పక తప్పదు. బీజేపీ, కాంగ్రెస్ కూటములకు చెందని ప్రాంతీయ పార్టీలు అస్తిత్వ పరీక్షను ఎదుర్కొంటున్నాయి. బీఆర్ఎస్, బీజేడి, వైసీపీ, ఆమ్ఆద్మీ పార్టీలు మనుగడకోసం కష్టపడు తున్నాయి. 2025 ఈ విషయంలో మరింత స్పష్టత నిస్తుందనడంలో సందేహం లేదు. అయితే మోడీ తన ఆర్థిక విధానాలను, పాలనా తీరును సమీక్షించుకోక తప్పదు. లేకుంటే మోడీ అస్తిత్వం కూడా ప్రశ్నార్థకం కాగలదు. దేశానికి దిశదశ చూపేలా రాజకీయాలు చేయాలి. ప్రజల బాటలో నడవాలి. అప్పుడే మోడీ నిలుస్తారు.

# న్యూ ఇయర్ వేడుకల్లో భారీగా ఆన్‌లైన్ బిజినెస్

## భారీగా ఆర్డర్ చేసిన కండోమ్స్..లో దుస్తులు • ఫుడ్‌కు యధావిధిగానే పెరిగిన డిమాండ్

**న్యూఢిల్లీ, జనవరి 1 :** భారత్ సహా ప్రపంచ దేశాలన్నీ 2025 సంవత్సరానికి ఆహ్వానం పలికాయి. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా భారత్‌లో ఏ వస్తువుల ఎక్కువగా ఆర్డర్ చేశారో తెలుసుకోవాలని చాలా మందికి ఆసక్తి ఉంటుంది. కొందరు ఫుడ్ ఆర్డరిస్తే, కొందరు డ్రింక్స్ పెడుతుంటారు. డిసెంబర్ 31న భారతీయులు ఎక్కువగా ఆర్డర్ చేసిన ఐటమ్స్ వివరాలను ప్రముఖ ఈ కామర్స్ దిగ్గజాలు బ్లింకిట్, స్విగ్గీ, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ షేర్ చేశాయి. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా అత్యంత ప్రజాదరణ పొందిన వస్తువుల వివరాలను నెటిజన్లతో షేర్ చేసుకున్నారు. ఊహించినట్లగానే కొత్త సంవత్సరంలో పార్టీలు బాగా జరిగాయి. దేశవ్యాప్తంగా ప్రజలు స్నాక్స్ ఎక్కువ బుక్ చేసుకున్నారు. రాత్రి 8 గంటల వరకే బ్లింకిట్‌లో 2.3 లక్షల ఆలూ భుజియా ప్యాకెట్లు డెలివరీ అయ్యాయి. స్విగ్గీ ఇన్‌స్టామార్ట్‌లో సైతం గత రాత్రి 7.30 గంటలకే నిమిషానికి 853 చిప్స్ ఆర్డర్‌లు వచ్చాయి. స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ లో అత్యధిక బుకింగ్స్ పాలు, చిప్స్,చాక్లెట్, ద్రాక్ష, పన్నీర్ ఐటమ్స్ ఉన్నాయని వెల్లడించింది. కూల్ డ్రింక్స్, ఐస్ క్యూబ్స్ కూడా భారీగా ఆర్డర్ చేశారు. మంగళవారం రాత్రి 8 గంటల వరకే బ్లింకిట్ ద్వారా డెలివరీ 6,834 ఐస్ క్యూబ్స్ ప్యాకెట్లు, అదే సమయానికి బిగ్ బాస్కెట్‌లో ఐస్ క్యూబ్‌ల ఆర్డర్‌లు 1290 శాతం పెరిగాయి. 7:41 గంటల సమయంలో 119 కిలోలు ఐస్ క్యూబ్స్ డెలివరీ అయ్యాయని స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ ట్వీట్ చేసింది. బిగ్‌బాస్కెట్‌లో నాన్ ఆల్కహాలిక్ డ్రింక్స్ విక్రయాలు 552 శాతం పెరిగాయి. డిస్పోజబుల్ కప్పులు, ప్లేట్‌ల ఆర్డర్స్ సైతం 325 శాతం పెరిగాయి. సోడా, మాక్‌టెయిల్ విక్రయాలు సైతం 200 శాతం పెరిగాయి. న్యూ ఇయర్ సందర్భంగా అత్యధిక విక్రయాలు జరిగిన మరో ఐటమ్ కండోమ్స్. డిసెంబర్ 31 మధ్యాహ్నం వరకే స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ 4,779 ప్యాక్‌ల కండోమ్స్ డెలివరీ చేసింది. సాయంత్రం తరువాత నిరోధ్‌ల విక్రయాలు మరింత పెరిగాయి. బ్లింకిట్‌లో సైతం కండోమ్ అమ్మకాలు భారీగా పెరిగాయి. 1.2 లక్షల కండోమ్‌ల ప్యాకెట్లు డెలివరీ చేశామని వెల్లడించారు. లో దుస్తులు సైతం కొందరు ఆర్డర్ పెట్టడం విశేషం.నూతన సంవత్సర వేడుకల సందర్భంగా కస్టమర్ కళ్లకు గంతలు కట్టి, చేతికి సంకెళ్లు కావాలని ఆర్డర్ చేసినట్లు స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ ట్వీట్ చేసింది. వీటితో పాటు గతంలో ఎన్నడూ లేనంతగా కూల్ డ్రింక్స్, చిప్స్ విక్రయాలు పెరిగాయంటే ఎక్కువగా ఇంట్లో కుటుంబసభ్యులతో న్యూ ఇయర్ జరుపుకున్నారని ఈకామర్స్ దిగ్గజాలు చెబుతున్నారు.



# మద్యం మత్తులో కరెంట్ స్తంభం ఎక్కిన యువకుడు

## హాయిగా తీగల మీద నిద్ర.. ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆపేసిన స్థానికులు

**అమరావతి, జనవరి 1:** పీకలదాకా తాగిన తర్వాత మందుబాబులు వేసే చిందులు అన్నీ ఇన్నీ కావు.. వాళు చేసే చేష్టలు నభూతో న భవిష్యత్తు అనిపించేలా ఉంటాయి. న్యూఇయర్ వేళ ఓ మందుబాబు చేసిన పని కూడా ఇప్పుడు అలాగే ఉంది. డిసెంబర్ 31కి దావత్ అని ఫుల్లుగా తాగిన ఓ మందుబాబు ఏకంగా పోల్ ఎక్కి కరెంటు తీగలపైనే పడుకున్నాడు. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ మండలం ఎం.సింగపురంలో మంగళవారం నాడు ఓ మందుబాబు హల్‌చల్ చేశాడు. డిసెంబర్ 31 అని పొద్దున్నే తాగేశాడు. అయినా చాలకపోవడంతో మందుకు డబ్బు కావాలని ఇంటికెళ్లి వాళ్ల అమ్మను అడిగాడు. కానీ ఆమె డబ్బులు ఇవ్వకపోవడంతో కోపంలో బయటకు వెళ్లిన అతను.. దగ్గరలో ఉన్న కరెంటు పోల్ ఎక్కేశాడు. మద్యం మత్తులో అతను విద్యుత్ స్తంభం ఎక్కడం చూసిన పలువురు అతని దగ్గరకు పరిగెత్తారు. కానీ వాళ్ల మాటలేమీ పట్టించుకోకుండా అతను పైకి ఎక్కేశాడు. దీంతో కరెంటు తీగలు ముట్టుకుంటాడేమో అన్న భయంతో స్థానికులు ట్రాన్స్‌ఫార్మర్ ఆపేశాడు.





# ఆలయాలకు పోటెత్తిన భక్తులు

**హైదరాబాద్, జనవరి 1 :** కొత్త సంవత్సరం వేడుకలు మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు కొనసాగాయి. చిన్నా, పెద్దా న్యూ ఇయర్ సెలబ్రేషన్స్‌లో భాగస్వాములై.. కొత్త ఏడాదికి ఘనంగా స్వాగతం పలికారు. ఇక న్యూ ఇయర్ సంబురాలు ముగియడంతో.. బుధవారం ఉదయం నుంచి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. దేశ వ్యాప్తంగా ఉన్న ప్రధాన ఆలయాలకు భక్తులు తరలి వెళ్తున్నారు. నూతన సంవత్సరం రోజున తమ ఇష్ట దైవాన్ని దర్శించుకుని, అంతా శుభం జరగాలని భక్తులు కోరుకుంటున్నారు. ఇక భక్తుల తాకిడిని ముందే ఊహించిన ఆలయాల అధికారులు.. వారి రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేశారు. తెలంగాణలోని యాదాద్రి, భద్రాద్రి, వేములవాడ, జోగులాంబతో పాటు ఇతర ఆలయాలకు భక్తులు బారులు తీరారు. దర్శనానికి 3 గంటల సమయం పడుతోంది. హైదరాబాద్ నగరంలోని చిలుకూరు బాలజీ టెంపుల్, బిర్లా మందిర్, పెద్దమ్మ తల్లి ఆలయం, జూబ్లీహిల్స్, హిమాయత్ నగర్‌లోని టీటీడీ ఆలయాలు, పద్మారావు నగర్‌లోని స్కంధగిరి టెంపుల్‌కు భక్తులు పోటెత్తారు.

# సంధ్య థియేటర్ ఘటనలో వివరణ ఇవ్వండి

## జాతీయ మానవ హక్కుల కమిషన్ నోటీసులు

**హైదరాబాద్, జనవరి 1 :** సంధ్య థియేటర్ ఘటనలో వివరణ ఇవ్వాలని తెలంగాణ డీజీపీ, హైదరాబాద్ సీపీకి జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) నోటీసులు జారీ చేసింది. డిసెంబరు 4న పుష్ప-2 ప్రీమియర్ షో సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనకు సంబంధించి న్యాయవాది రామారావు.. ఎన్‌హెచ్‌ఆర్‌సీకి ఫిర్యాదు చేశారు. ప్రీమియర్ షోకి అల్లు అర్జున్ రావడం, పోలీసులు లాఠీఛార్జ్ చేయడం వల్లే తొక్కిసలాట జరిగి రేవతి మృతి చెందిందని, బాలుడికి తీవ్ర గాయాలయ్యాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై స్పందించిన కమిషన్ సంధ్య థియేటర్ ఘటనపై సీనియర్ ర్యాంక్ పోలీసు అధికారితో విచారణ జరిపించి నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. ఘటనపై నాలుగు వారాల్లో నివేదిక ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొంది.

# భగీరథమ్మ చెరువులో కూల్చివేతలు సక్రమమే

## హైడ్రా కమిషనర్ రంగనాథ్ వివరణ

**హైదరాబాద్, జనవరి1:** ఖాజాగూడ భగీరథమ్మ చెరువు ఎఫ్‌టీఎల్‌లో కూల్చివేతలను హైడ్రా కమిషనర్ రంగనాథ్ సమర్థించారు. నిబంధనలు పాటిస్తూనే ఆక్రమణలు కూల్చివేశామని ప్రకటించారు. 'నీటి వనరుల్లోని నిర్మాణాలను నోటీసులు ఇవ్వకుండానే కూల్చివేయవచ్చు. ఇటీవల జస్టిస్ గవాయ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు డివిజన్ బెంచ్ ఇదే అంశంపై తీర్పు ఇచ్చింది. చట్టాలను పాటిస్తూ, కోర్టులను గౌరవిస్తూనే ఆక్రమణలు తొలగిస్తున్నాం. మానవతా దృక్పథంతో 24 గంటల్లో ఖాళీ చేయాలని నోటీసులు ఇచ్చాం' అని రంగనాథ్ వివరించారు. హైదరాబాద్ ఖాజాగూడలోని బ్రహ్మనికుంట ప్రాంతంలో ఆక్రమణల తొలగింపులో హైడ్రా వ్యవహరించిన తీరుపై హైకోర్టు మంగళవారం ఆగ్రహం వ్యక్తం చేసింది. నోటీసులు జారీ చేసి 24 గంటలు గడవకముందే కూల్చివేతలు చేపట్టడమేమిటని నిలదీసింది. దీనిపై గతంలో హైడ్రా కమిషనర్‌కు స్పష్టంగా చెప్పినా మళ్లీ అదే కొనసాగిస్తున్నారని, ఇలాగైతే మరోసారి కోర్టుకు పిలిపించాల్సి ఉంటుందని హెచ్చరించింది. ఖాజాగూడలో చెరువు ఎఫ్‌టీఎల్ ప్రాంతమంటూ నిర్మాణాలను కూల్చివేయడాన్ని సవాలు చేస్తూ మేకల అంజయ్య తదితరులు మంగళవారం అత్యవసరంగా భోజన విరామ సమయంలో విచారించాలంటూ (లంచ్ మోషన్) పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. శేరిలింగంపల్లి మండలం ఖాజాగూడ గ్రామంలోని సర్వే నం.18/ఇలో 12640 చదరపు గజాల స్థలంలో నిర్మాణాలు ఎఫ్‌టీఎల్‌లో ఉన్నాయంటూ ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే కూల్చివేతలు చేపట్టారన్నారు. హైడ్రా తరఫు న్యాయవాది కటిక రవీందర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. హైడ్రా అధికారులు అక్కడ విచారించిన తరువాతే చర్యలు చేపట్టారన్నారు. జీహెచ్‌ఎంసీ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. అనుమతుల్లేకుండా పిటిషనర్లు నిర్మాణాలు చేపట్టారన్నారు. వాదనలను విన్న న్యాయమూర్తి.. నోటీసులు ఇవ్వకుండా ఎలా కూల్చివేస్తారని ప్రశ్నించారు. నోటీసులు ఇచ్చామని న్యాయవాది చెప్పగా.. 24 గంటలే సమయం ఇస్తారా అంటూ న్యాయమూర్తి నిలదీశారు. కనీసం బాధితుల వివరణ తీసుకోకుండా కూల్చివేతలు ఎలా చేపడతారని అన్నారు. ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారిస్తూ నోటిఫికేషన్ జారీ చేశారా అని ప్రశ్నించారు. తాజాగా నోటీసులు జారీ చేసి పిటిషనర్ల వివరణ తీసుకున్నాక.. చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనుమతుల్లేకుండా పిటిషనర్లు ప్రహరీ సహా ఏవైనా నిర్మాణాలు చేపట్టినట్లయితే వాటిని జీహెచ్‌ఎంసీ కూల్చివేయవచ్చని పేర్కొంటూ పిటిషన్‌పై విచారణను మూసివేశారు. హైకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో హైడ్రా కమిషనర్ వివరణ ఇచ్చారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
గురువారం 2
జనవరి 2025



# మీరు ఇప్పటికైనా మేల్కొనరా..!?

## టీమిండియా ఆటగాళ్లపై నోరుపారేసుకున్న గంభీర్



బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ 2024–25లో టీమిండియా వెనుకబడింది. విజయంతో సిరీస్‌ను ప్రారంభించిన భారత జట్టు గత 3 మ్యాచ్‌ల్లో 2 ఓడిపోగా, ఒక మ్యాచ్ డ్రాగా ముగిసింది. మెల్‌బోర్న్ టెస్ట్‌లో కూడా టీమిండియా చాలా చెత్త ప్రదర్శన చేసింది. యంగ్ ప్లేయర్లు జైస్వాల్, నితీశ్ కుమార్ రెడ్డి, పేసర్ బుమ్రాలు తప్ప మిగితా ఎవరు పెద్దగా పదర్శన కనబరచలేదు. ఇది ఇలా ఉంటే ఈ ఏడాది తొలిరోజే ఓ షాకింగ్ న్యూస్ వెలుగులోకి వచ్చింది. టీమ్ ఇండియా డ్రెస్సింగ్ రూమ్ విషయం లీక్ అయింది. మీడియా కథనాల ప్రకారం, టీమ్ ఇండియా డ్రెస్సింగ్ రూమ్‌లో వాతవరణం అంతా బాగా ఏమి లేదని తెలుస్తుంది. మెల్‌బోర్న్ టెస్టులో ఓటమి తర్వాత టీమిండియా డ్రెస్సింగ్ రూమ్‌లో పెద్ద దుమారమే రేగింది. దీంతో షాకింగ్ విషయం వెలుగులోకి వచ్చింది. భారత బ్యాట్స్‌మెన్‌ల ఆటతీరుపై గౌతమ్ గంభీర్ ఏమాత్రం సంతోషంగా లేడని, మెల్‌బోర్న్ మ్యాచ్‌లో ఓడిపోయిన తర్వాత రోహిత్ శర్మ–విరాట్ కోహ్లి సహా మొత్తం భారత జట్టుపై గంభీర్ డ్రెస్సింగ్ రూమ్‌లోనే విరుచుకుపడ్డినట్లు తెలుస్తుంది. గంభీర్ ఆటగాళ్లను ఉద్దేశించి మీరు ఇప్పటికైనా మేల్కొనరా అని తిట్టినట్లు తెలుస్తుంది. అంతే కాకుండా భవిష్యత్తులో తన వ్యూహాన్ని పాటించని వారిని కూడా జట్టు నుంచి తప్పించే అవకాశం ఉందని గంభీర్ ఆటగాళ్లను హెచ్చరించాడు. జూలై 9న కోచ్‌గా బాధ్యతలు స్వీకరించిన గంభీర్ ఇప్పటివరకు ఆటగాళ్లకు స్వేచ్ఛనిచ్చాడు. అయితే, ఇటీవల పేలవమైన ఆటతీరుతో విసిగిపోయిన అతను ఇప్పుడు ఆటగాళ్లపై కఠినంగా వ్యవహరించనున్నట్లు తెలుస్తుంది. డ్రెస్సింగ్ రూమ్‌లో ఫైట్‌తో పాటు.. టీమిండియా ఎంపిక విషయంలో కూడా ఓ పెద్ద విషయం రివీల్ అయింది. ఈ టెస్టు సిరీస్ గంభీర్‌కి ఇదే తొలి పర్యటన.. ఈ టూర్‌లో అనుభవం ఉన్న బ్యాట్స్‌మెన్ ఛటేశ్వర్ పుజారాను జట్టులోకి తీసుకోవాలని గంభీర్ భావించాడు. కానీ అతని మాటలను భారత సెలక్టర్లు అంగీకరించలేదు. ఆస్ట్రేలియాలో ఛటేశ్వర్ పుజారా గణాంకాలు బాగా ఆకట్టుకున్నాయి, క్రీజులో ఎక్కువ సమయం ఎలా గడపాలో అతనికి తెలుసు అని గంభీర్ సెలక్టర్లుతో చెప్పినట్లు సమాచారం. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ తొలి మ్యాచ్‌లో రోహిత్ శర్మ జట్టులో లేరు. దీంతో జస్ప్రీత్ బుమ్రా జట్టుకు నాయకత్వం వహించాడు. అయితే బుమ్రాను కెప్టెన్‌గా చేయడానికి జట్టులోని ఒక ఆటగాడు ఇష్టపడలేదని మీడియా కథనాలు వెల్లడించాయి. అయితే ఆటగాళ్ల మధ్య కొంత వైరుధ్యం ఉందని, అది ఆటపై ప్రభావం చూపుతున్నదని స్పష్టమైంది. టీమిండియా డ్రెస్సింగ్ రూమ్ నుండి ఈ విషయాలన్నీ లీక్ కావడంతో భారత క్రికెట్‌లో కలకలం రేగింది. దీనిపై క్రికెట్ అభిమానులు సోషల్ మీడియాలో చర్చ జరుగుతుంది. మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్ కూడా ఒక పోస్ట్‌లో డ్రెస్సింగ్ రూమ్ లీక్ కావడంపై తన అభిప్రాయాన్ని తెలిపారు. 'డ్రెస్సింగ్ రూమ్‌లో ఏమి జరుగుతుందో డ్రెస్సింగ్ రూమ్‌లో మాత్రమే ఉండాలి!' ఆయన పేర్కొన్నాడు.



# కెప్టెన్సీ రేసులో ముందున్న బుమ్రా

## రోహిత్ శర్మ జట్టుకు గుడ్ బై చెప్పే అవకాశాలు
## భారత్‌కు కొత్త కెప్టెన్ వేటలో బీసిసిఐ

ఆస్ట్రేలియా పర్యటనలో భారత్ ఓవైపు కఠిన పరిస్థితులు ఎదుర్కొంటోంది. ఓ టెస్టు గెలిచి రెండు టెస్టులు ఓడిపోయింది. ఇప్పుడు తప్పక గెలవాల్సిన సిడ్నీ టెస్టులో గెలుపు కోసం వ్యూహాలు రచిస్తోంది. అయితే అన్నింటి కంటే పెద్ద సమస్యగా మారిన టెస్టు జట్టు కెప్టెన్సీ విషయంలో బీసీసీఐ సైతం మల్లగుల్లాలు పడుతోంది. టీమిండియాలో ఉన్న పరిమిత ఆప్షన్లే అందుకు కారణంగా కనిపిస్తున్నాయి. దీంతో రోహిత్ శర్మ సిడ్నీ టెస్టు తర్వాత తప్పుకుంటే కొత్త కెప్టెన్ ఎవరన్న చర్చ జరుగుతోంది. భారత్–ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న బోర్డర్–గవాస్కర్ ట్రోఫీ టెస్టు సిరీస్ లో ప్రస్తుతం కంగారూలు 2–1 ఆధిక్యంలో ఉన్నారు. సిడ్నీలో ఎల్లుండి ప్రారంభమయ్యే చివరి టెస్టులో భారత్ తప్పక గెలవాల్సిన పరిస్థితి. ఈ మ్యాచ్ లో గెలిస్తే సిరీస్ సమం చేసే అవకాశాలు, అలాగే ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్ ఫైనల్ రేసులో నిలిచే అవకాశాలు ఉంటాయి. అయితే ప్రస్తుతం టీమిండియా ఫామ్, కెప్టెన్ రోహిత్ శర్మ వ్యక్తిగత ప్రదర్శన, ఇతర ఆటగాళ్ల ఫామ్ ఇలా ఎటు చూసినా ఆందోళనకర పరిస్థితులే నెలకొన్నాయి. ఇప్పుడే ఇలా ఉంటే సిడ్నీ టెస్టు తర్వాత రోహిత్ శర్మ తప్పుకుంటే పరిస్థితి మరింత దారుణంగా మారనుంది. సిడ్నీ టెస్టు తర్వాత రోహిత్ శర్మతో పాటు కోహ్లీ కూడా జట్టుకు గుడ్ బై చెప్పే అవకాశాలు ఉన్నాయి. రోహిత్ చివరి నిమిషంలో నిర్ణయం మార్చుకుంటే తప్ప భారత్ కు కొత్త కెప్టెన్ ను వెతుక్కోక తప్పని పరిస్థితి. దీంతో పెర్త్ టెస్టులో కెప్టెన్సీ తీసుకుని భారత్ ను గెలిపించిన పేసర్ జస్ ప్రీత్ బుమ్రా ఇప్పుడు టెస్టు జట్టు కెప్టెన్సీ ఆశాకిరణంలా కనిపిస్తున్నాడు. ప్రస్తుతం జట్టుకు వైస్ కెప్టెన్ గా ఉన్న బుమ్రా కెప్టెన్సీ రేసులో ముందున్నాడు. అయితే బుమ్రా తరచూ గాయాల పాలవుతుండటం, జట్టుకు అందుబాటులో ఉండకపోవడంతో అతన్ని నమ్మి టెస్టు కెప్టెన్సీ అప్పజెప్పే పరిస్థితీ లేదు. దీంతో బీసీసీఐ ఆలోచనలో పడింది. ఇందుకు బీసీసీఐ వద్ద ఉన్న మరో పరిష్కారం కెప్టెన్సీ విభజన. రోహిత్ తరహాలో బుమ్రా టెస్టు, టీ20 ఫార్మాట్లలో జట్టును నడిపించే పరిస్థితి లేదు. దీంతో టెస్టు జట్టుకు ప్రస్తుతానికి బుమ్రాను కెప్టెన్ గా ప్రకటించి వన్డేలకు కొత్త కెప్టెన్ ను వెతుక్కోవడమే మేలనిపిస్తోంది. రోహిత్ ఇంకా వన్డేల్లో రిటైర్మెంట్ తీసుకోలేదు. కాబట్టి ఎలాగో ఛాంపియన్స్ ట్రోఫీ వరకూ అందుబాటులో ఉంటాడు. ఆ తర్వాత కెఎల్ రాహుల్, శ్రేయాస్ అయ్యర్, రిషబ్ పంత్ లలో ఒకరికి వన్డే కెప్టెన్సీ ఇచ్చే అవకాశాలున్నాయి. టీ20ల్లో ఎలాగో సూర్యకుమార్ యాదవ్ ఇప్పటికే మంచి కెప్టెన్ గా రాణిస్తున్నాడు. కాబట్టి ఇదే బీసీసీఐకి బెటర్ ఆప్షన్ లా ఉంది.

# రిషబ్ పంత్‌పై వేటు పడేనా?

- జట్టు మేనేజ్ మెంట్ కఠిన నిర్ణయం తీసుకునే అవకాశం
- జట్టులోకి రానున్న ధృవ్ జురెల్



బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఐదో టెస్ట్ జనవరి 3 నుంచి ప్రారంభం కానుంది. ఇప్పటికే ఈ సిరీస్ లో ఆస్ట్రేలియా 2–1 తేడాతో ఆధిక్యంలో ఉంది. ఈ టెస్ట్ లో గెలిస్తేనే సిరీస్ సమం అవుతుంది. లేకుంటే ఆసీస్ సొంత అవుతుంది. అందుకే ఐదో టెస్ట్ గెలవాలని టీమిండియా పట్టుదలగా ఉంది. చివరి టెస్ట్ లో ఆడే జట్టులో మార్పులు చేసే అవకాశం ఉంది. ముఖ్యంగా రిషబ్ పంత్ పట్ల జట్టు మేనేజ్ మెంట్ కఠిన నిర్ణయం తీసుకునే అవకాశం కనిపిస్తోంది. రిషబ్ పంత్ స్థానంలో ధృవ్ జురెల్ ను జట్టులోకి తీసుకునే అవకాశం ఉంది. ఈ యువ కీపర్–బ్యాటర్ ఈ సిరీస్ కు ముందు ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్ లో రాణించాడు. మెల్‌బోర్న్ పిచ్‌పై 80, 68 పరుగులు చేశాడు. ముంబైతో జరిగిన ఇరానీ ట్రోఫీలో రాజస్థాన్ తరపున 93 పరుగులతో జురెల్ ఆకట్టుకున్నాడు. అయితే పెర్త్‌లో జరిగిన తొలి టెస్టుకు జురెల్ 11, 1 పరుగే చేశాడు. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 12 పరుగులే చేశాడు. సిడ్నీ టెస్టులో పేలుడు బ్యాటింగ్ కంటే నిలకడ, స్థిరత్వంగా బ్యాటింగ్ చేసేవారికి భారత మేనేజ్‌మెంట్ ప్రాధాన్యత ఇస్తున్నట్లు కనిపిస్తోంది. రెడ్–బాల్ క్రికెట్‌లో భారత్ గేమ్–ఛేంజర్‌గా రిషబ్ పంత్ వరుసగా విఫలం అవుతూ వస్తున్నాడు. నాలుగు టెస్టుల్లో, పంత్ 37, 1, 21, 28, 9, 28, 30 పరుగలు చేశాడు. 22 సగటుతో 154 పరుగులు మాత్రమే చేయగలిగాడు. టెస్ట్ క్రికెట్‌ను వన్డే క్రికెట్ లా ఆడడం వల్ల పంత్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు నిర్లక్ష్యంగా ఆడి వికెట్ పడేసుకుంటున్నాడు. బాక్సింగ్ డే టెస్ట్ లో మొదటి ఇన్నింగ్స్ పంత్ ఓ షాట్ ఆడి ఔటయ్యాడు. దీనిపై భారత మాజీ ఆటగాడు సునీల్ గవాస్కర్ ఫైర్ అయ్యాడు. అక్కడ ఫిల్డర్ ఉన్నా అటే షాట్ ఎలా ఆడతావని ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఈ నేపథ్యంలోనే తుది జట్టులో పంత్ కు స్థానం ఉండకపోవచ్చని భావిస్తున్నారు. రిషబ్ పంత్ గత రెండు ఆస్ట్రేలియా పర్యటనల్లో అదరగొట్టిన సంగి తెలిసిందే. కానీ ఈసారి మాత్రం నిరాశ పరుస్తున్నాడు. కెప్టెన్ రోహిత్ శర్మ కూడా ఫామ్ లో లేనప్పటికీ అతని స్థానం పదిలంగా ఉండనుంది.

# సెంట్రల్ కాంట్రాక్ట్‌లో మార్పులకు బీసీసీఐ కసరత్తు

- రోహిత్ శర్మ, విరాట్ కోహ్లిలకు పదోన్నతి లభించే అవకాశం
- జైస్వాల్, నితీష్ రెడ్డిలకూ ప్రమోషన్ చాన్స్
- పంత్, జడేజా గ్రేడ్ లలో కూడా మార్పుకు బీసీసీఐ అడుగులు





2024లో టీమిండియా ప్రదర్శన ఆశాజనకంగా ఏమి లేదు. గతేడాది టీ20 ప్రపంచకప్‌ను గెలవడమే కాకుం డా టీమిండియా రాణించలేకపోయింది. ఓ వైపు జట్టు లోని స్టార్ ప్లేయర్లు చేతులు ఎత్తివేయగా, మరోవైపు యువ ఆటగాళ్లు చెప్పుకోదగ్గ ప్రదర్శన చేశారు. అందువల్ల 2025లో టీమిండియా వెటరన్లకు బీసీసీఐ పెద్ద ఎదురుదెబ్బ తగిలే అవకాశం ఉందని, సెంట్రల్ కాంట్రాక్ట్‌లో చాలా మార్పులు చోటుచేసుకునే అవకా శం ఉందని పలువురు క్రికెట్ నిపుణలు చెబుతున్నారు. ప్రస్తుతం ఏం గ్రేడ్‌లో ఉన్న ఆటగాళ్లను డిమోట్ చేసే అవకాశం ఉంది. అలాగే జైస్వాల్, నితీష్ రెడ్డి లాంటి యువ ఆటగాళ్లు మంచి ప్రదర్శన కనబరిచే అవకాశం ఉంది. 2024లో టెస్టు, వన్డే కెప్టెన్ రోహిత్ శర్మ ఫామ్‌లో లేడు. అందువల్ల రోహిత్ పేలవమైన ప్రదర్శన కారణంగా బీసీసీఐ ఏం గ్రేడ్ నుండి ఏ గ్రేడ్‌కి తగ్గించే అవకాశం ఉంది. ప్రస్తుతం ఏం గ్రేడ్‌లో ఉన్న రోహిత్ ఏటా రూ.7 కోట్లు జీతం పొందుతున్నాడు. కానీ ఏ గ్రేడ్ కు దిగజారితే ఏడాదికి రూ.5 కోట్లే వస్తాయి. విరాట్ కోహ్లి రోహిత్ లాగే అంతగా ప్రదర్శన ఏమి చేయడం లేదు. దీంతో విరాట్‌ను కూడా ఏ గ్రేడ్‌కి తగ్గించే అవకాశం ఉంది. ఈ ఏడాది టెస్టుల్లో 1478 పరుగులతో యశస్వి జైస్వాల్ సత్తాచాటాడు. అందువల్ల బీసీసీఐ కాంట్రాక్ట్‌లో జైస్వాల్‌కు పదోన్నతి లభించే అవకాశం ఉంది. జైస్వాల్ ప్రస్తుతం రూ.3 కోట్ల వార్షిక వేతనంతో బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్ట్‌లో బి గ్రేడ్‌లో ఉన్నాడు.

ఇటీవల అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపె ట్టిన నితీష్ కుమార్‌రెడ్డి ఆస్ట్రేలియా పర్యటనలో అద్భుత ప్రదర్శన చేశాడు. బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్ట్‌లో సి–గ్రేడ్‌లో ఉన్నాడు. ఏటా రూ.1 కోటి జీతం వస్తుంది.

# ఉత్కంఠ పోరులో హైదరాబాద్ విజయం

- 3 వికెట్ల తేడాతో కర్ణాటకపై గెలుపు
- ఆఖరి ఓవర్ వరకు ఉత్కంఠగా సాగిన మ్యాచ్
- తిలక్ వర్మ, వరుణ్ గౌడ్ అసాధారణ బ్యాటింగ్
- విజయ్ హజారే ట్రోఫీలో అహ్మదాబాద్ వేదికగా మ్యాచ్



ప్రతిష్టాత్మక విజయ్ హజారే ట్రోఫీలో హైదరాబాద్ సంచలన విజయాన్నందుకుంది. గ్రూప్–సీలో భాగంగా కర్ణాటకతో అహ్మదాబాద్ వేదికగా మంగళవారం జరిగిన మ్యాచ్‌లో 3 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఆఖరి ఓవర్ వరకు ఉత్కంఠగా సాగిన ఈ మ్యాచ్‌లో కెప్టెన్ తిలక్ వర్మ(106 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 99), వరుణ్ గౌడ్ (82 బంతుల్లో 7 ఫోర్లు, 5 సిక్స్‌లతో 109) అసాధారణ బ్యాటింగ్‌తో రెండు బంతులు మిగిలి ఉండగానే విజయాన్నందుకుంది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన కర్ణాటక నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లకు 320 పరుగులు చేసింది. ఆ జట్టు కెప్టెన్ మయాంక్ అగర్వాల్ (112 బంతుల్లో 15 ఫోర్లు, 2 సిక్స్‌లతో 124) సెంచరీ సాధించగా... ఆర్ సమరణ్(75 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్స్‌లతో 83) హాఫ్ సెంచరీతో రాణించాడు. హైదరాబాద్ బౌలర్లలో చామా మిలింద్ 3 వికెట్లు తీయగా.. మహమ్మద్, రోహిత్ రాయుడు తలో వికెట్ తీసారు. అనికేత్ రెడ్డి(2/40) రెండు వికెట్లు తీసాడు. అనంతరం లక్ష్య ఛేదనలో హైదరాబాద్ 49.4 ఓవర్లలో 7 వికెట్లకు 322 పరుగులు చేసి నెగ్గింది. చివర్లో తనయ్ త్యాగరాజన్(17 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 25)కీలక ఇన్నింగ్స్ ఆడాడు. కర్ణాటక బౌలర్లలో ప్రవీణ్ దుబే(2/49), నికిన్ జోస్(2/45) రెండేసి వికెట్లు తీయగా.. అభిలాష్ శెట్టి, విద్యాదర్ పాటిల్, శ్రేయస్ గోపాల్ తలో వికెట్ తీసారు. భారీ లక్ష్యచేధనలో ఓపెనర్లు రోహిత్ రాయుడు(0), తన్మయ్ అగర్వాల్(35) విఫలమైనా.. తిలక్ వర్మ, వరుణ్ గౌడ్ కీలక ఇన్నింగ్స్ ఆడారు. ఈ ఇద్దరూ ఐదో వికెట్‌కు 112 పరుగులు జోడించారు. ఈ కీలక భాగస్వామ్యం హైదరాబాద్‌కు విజయాన్నందించింది.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
Roaming News





# ఆఫ్టర్ మ్యారేజ్ అమ్మడికి ఫస్ట్ షాక్..!

మహానటి తో నేషనల్ వైడ్ గా క్రేజ్ తెచ్చుకున్న కీర్తి సురేష్ బాలీవుడ్ లో బేబీ జాన్ తో ఎంట్రీ ఇచ్చింది. కోలీవుడ్ లో సూపర్ హిట్ అయిన దళపతి విజయ్ తెరి సినిమాకు రీమేక్ గా బేబీ జాన్ వచ్చింది. వరుణ్ ధావన్, కీర్తి సురేష్ జంటగా ఈ సినిమా చేశారు. ఐతే బాలీవుడ్ ఎంట్రీతో కెరీర్ మరింత స్ట్రాంగ్ చేసుకోవాలని అనుకుంది కీర్తి సురేష్. కాకపోతే అమ్మడి ప్లాన్ రివర్స్ అయ్యింది. రీసెంట్ గా రిలీజైన బేబీ జాన్ సినిమా ఆడియన్స్ అంచనాలను అందుకోలేదు. ఫలితంగా సినిమా బాక్సాఫీస్ దగ్గర బోల్తా కొట్టింది. ఈమధ్యనే తన బోయ్ ఫ్రెండ్ ఆంటోనిని పెళ్లాడింది కీర్తి సురేష్. పెళ్లైనా కూడా సినిమా ప్రమోషన్స్ లో పాల్గొని ఆశ్చర్యపరచింది. ఐతే కీర్తి సురేష్ కి పెళ్లైన తర్వాత ఫస్ట్ షాక్ తగిలింది. బేబీ జాన్ రిజల్ట్ అమ్మడు ఇలా ఉంటుందని గెస్ చేయలేకపోయింది. బాలీవుడ్ లో సక్సెస్ కొడితే పెళ్లైనా సరే ఇక వరుస అవకాశాలు వస్తాయి కదా అని అనుకుంది కీర్తి బట్ ఆమె ప్లాన్ మొత్తం రివర్స్ అయ్యేలా చేసింది బేబీ జాన్. సౌత్ లో తన నటనతో ప్రేక్షకులను మెప్పిస్తూ వచ్చిన కీర్తి సురేష్ కథల ఎంపికలో కూడా తన స్పెషాలిటీ చాటుతూ వచ్చింది. ఐతే కీర్తి బాలీవుడ్ లో చేసిన మొదటి సినిమాకే తన గ్లామర్ ఎటాక్ తో సర్ ప్రైజ్ చేసింది. నార్త్ ఆడియన్స్ ని తన గ్లామర్ తో బుట్టలో వేసుకోవాలని చాలా పెద్ద ప్లానే వేసింది. కాకపోతే అది అంతగా వర్క్ అవుట్ కాలేదు. బేబీ జాన్ రిజల్ట్ తో పని లేకుండా కీర్తి సురేష్ కు బాలీవుడ్ ఆఫర్లు వస్తాయా లేదా అన్నది చూడాలి. ఇక పెళ్లి తర్వాత కెరీర్ కాస్త మందగిస్తుంది అన్నది తెలిసిందే. ఐతే బేబీ జాన్ ఇంపాక్ట్ కీర్తి సురేష్ మీద ఏ మేరకు ఉంటుంది అన్నది చూడాలి. కీర్తి సౌత్ సినిమాల్లో కూడా ఇక మీదట గ్లామర్ రోల్స్ చేసేందుకు కూడా సై అన్నట్టు తెలుస్తుంది. మరి పెళ్లి తర్వాత ఫస్ట్ రిజల్ట్ నిరాశపరిచినా నెక్స్ట్ ఆమెకు టైం కలిసి వస్తుందో లేదో చూడాలి.



# బ్లాక్ డ్రెస్‌లో కృతి మెస్మరైజింగ్

సరిగ్గా పదేళ్ల క్రితం మహేష్ బాబు, సుకుమార్ కాంబోలో వచ్చిన '1 నేనొక్కడినే' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు హీరోయిన్‌గా పరిచయం అయిన ముద్దుగుమ్మ కృతి సనన్. తెలుగులో మొదటి సినిమా నిరాశపరచడంతో పెద్దగా ఆఫర్లు సొంతం చేసుకోలేక పోయింది. ఆ తర్వాత చేసిన సినిమా సైతం బాక్సాఫీస్ వద్ద నిరాశ పరిచాయి. అయితే లక్కీగా ఈ అమ్మడికి బాలీవుడ్‌లో సూపర్ హిట్ సినిమాలు పడ్డాయి. హిందీలో ఈమె చేసిన సినిమాలు కమర్షియల్‌గా విజయాన్ని సొంతం చేసుకోవడం మాత్రమే కాకుండా నటిగా ఈమెకు మంచి గుర్తింపును తెచ్చి పెట్టాయి. అందుకే బాలీవుడ్‌లో గత పదేళ్లుగా వెనక్కి తిరిగి చూసుకోకుండా దూసుకు పోతుంది.

తెలుగు లో చాలా సంవత్సరాల తర్వాత ప్రభాస్‌కి జోడీగా ఆదిపురుష్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆదిపురుష్ సినిమా హిందీలో రూపొందినా తెలుగు ప్రేక్షకుల ముందుకు ఆ సినిమాతో మరోసారి కృతి సనన్ వచ్చింది. సీత పాత్రలో ఆమె నటించడం ద్వారా ఆమె పై చాలా మంది మరింత గౌరవంను అభిమానంను పెంచుకున్నారు. సోషల్ మీడియాలో ఈ అమ్మడికి ఉన్న ఫాలోయింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. హాలీవుడ్ స్టార్స్‌కి ఏమాత్రం తగ్గకుండా సోషల్ మీడియాలో ఫాలోయింగ్‌ను కలిగి ఉన్న ఈ అమ్మడు అందాల ఆరబోత విషయంలోనూ అదే కొనసాగిస్తూ దూసుకు పోతుంది. మరో వైపు ఈ అమ్మడు ఆకట్టుకునే అందంతో ఫోటోలను షేర్ చేస్తూ వస్తుంది. తాజాగా మరోసారి సోషల్ మీడియాలో కృతి సనన్ అందమైన ఫోటో వైరల్ అవుతోంది. ఒక పార్టీలో సన్ సెట్ సమయంలో తీసుకున్న ఈ ఫోటోలో కృతి మెరిసి పోతుంది. బ్లాక్ డ్రెస్‌లో కృతి సనన్ కనీసం చూపు తిప్పనివ్వడం లేదు అంటూ కొందరు కామెంట్స్ చేస్తే, నిజంగా కృతి మెస్మరైజింగ్ బ్యూటీ అంటూ కామెంట్స్ చేస్తున్నారు. అందమైన సూర్యాస్తమయం సమయంలోనూ ఈ అమ్మడు అంత కంటే ఎక్కువ అందంగా కనిపించడం ఈమెకే చెల్లింది. విభిన్నమైన మేకోవర్‌తో కృతి గతంతో పోల్చితే మరింత అందంగా, ఆకర్షణీయంగా కనిపిస్తుంది అంటూ కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



# అనసూయ గ్లామర్ డోస్.. అగ్గి రాజేసిందిగా!

స్మాల్ స్క్రీన్ యాంకర్ గా కెరీర్ ను స్టార్ట్ చేసి.. ఇప్పుడు నటిగా సినిమాలతో అనసూయ ఫుల్ బిజీగా గడుపుతున్న విషయం తెలిసిందే. సినీ ఇండస్ట్రీలోకి వచ్చిన తక్కువ గ్యాప్ లోనే ముద్దుగుమ్మ మంచి ఫేమ్ దక్కించుకుందనే చెప్పాలి. అదే సమయంలో తన గ్లామర్ తో అమ్మడు ఎప్పటికప్పుడు చేసే సందడి మామూలుగా ఉండదు. సినిమాలు, షూటింగ్స్ తో ఎంత బిజీగా ఉన్నా.. ఫ్యామిలీతో క్వాలిటీ టైమ్ స్పెండ్ చేస్తుంటుంది అనసూయ. ఎప్పటికప్పుడు భర్త, పిల్లలతో వెకేషన్స్ కు వెళ్తూ ఫుల్ గా చిల్ అవుతుండడం మనం చూస్తూనే ఉంటాం. మాగ్జిమమ్ ఏ ఫెస్టివల్ ను కూడా ఆమె మిస్ కారు. అటు ఎంజాయ్ చేస్తూ.. ఇటు పూజలూ చేస్తుంటుంది. ఇప్పుడు న్యూ ఇయర్ సందర్భంగా తన ఫ్యామిలీతో సెలబ్రేషన్స్ జరుపుకుంది అనసూయ. అందుకు సంబంధించిన పిక్స్.. ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతున్నాయి. సింపుల్ గా ఇంటర్నెట్ ను షేక్ చేస్తున్నాయనే చెప్పాలి. నెటిజన్లు క్లీన్ బౌల్డ్ అవుతూ.. లైకులు కొడుతూ.. షేర్ చేస్తూ సందడి చేస్తున్నారు. అయితే డీప్ నెక్ మోడ్రన్ డ్రెస్ వేసుకున్న అనసూయ.. గ్లామర్ షో గేట్లను పూర్తిగా ఎత్తేసినట్లు క్లియర్ గా తెలుస్తోంది. ఓ రేంజ్ లో అందాలను హైలెట్ చేస్తూ.. తన స్కిన్ షోతో అదరగొట్టేసింది. సింపుల్ నెక్లెస్ వేసుకున్న ఆమె పిక్స్.. ఇప్పుడు సోషల్ మీడియాలో హీట్ పుట్టిస్తున్నాయి.. వేరే లెవెల్ లో సెగలు కూడా రేపుతున్నాయి. పిక్స్ ను షేర్ చేస్తూ అనసూయ.. హ్యాపీ 2025 మై లవ్లీస్ అంటూ విష్ చేసింది. "గత ఏడాది మనలో చాలా మందికి కష్టంగా సాగిందని తెలుసు. అయితే సన్ సెట్ ను రీసెట్ చేసుకోవడానికి ఓ ఛాన్స్.. ప్రతి సన్ రైజ్ కొత్త కళ్ళతో స్టార్ట్ అవుతుంది. కానీ రోజూ ఏదో ఒక తప్పు చేసేయకండి" అంటూ అనసూయ రాసుకొచ్చింది. ఇక కెరీర్ విషయానికొస్తే.. రీసెంట్ గా పుష్ప 2: ది రూల్ మూవీలో సందడి చేసిన అనసూయ.. యాక్టింగ్ కు గాను మంచి ప్రశంసలు అందుకుంది. అయితే ఆమె కోసమే రచయితలు సినిమాలో కొన్ని పాత్రలు సృష్టిస్తున్నారని ఎప్పటి నుంచో టాక్ వినిపిస్తోంది. దాని బట్టి ఆమె ఎలాంటి క్రేజ్ సంపాదించుకుందో తెలుస్తోంది. మరి ఫ్యూచర్ లో అనసూయ.. తన చిత్రాలతో ఎలా అలరిస్తుందో వేచి చూడాలి.

Printed, published and owened by GOTTIPARTHI MADHURI, printed at MADHURI OFFSET PRINTERS H.NO 3-133, BC colony yadagirigutta, dist : Yadadri Buvanagiri pin : 508115, Ts Publictions at Madhuri publications. Editor : GOTTIPARTHI BHASKER. RNA TELTEL /2021/80986